ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం అక్టోబరు 1, 2024



నీ రక్తదానం.. నిలుపు ప్రాణం

- అత్యవసర వేళల్లో రోగులకు ఇబ్బందులు
- అపోహలు వీడి చైతన్యం పెరగాల్సిన అవసరం

కాకినాడ గ్రామీణ ప్రాంతానికి చెందిన గర్భిణి ప్రసవ వేదనతో నగరంలోని ఆసుపత్రిలో చేరారు. అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి వచ్చింది. నెగెటివ్ గ్రూప్ రక్తం దొరకలేదు. అధికారుల చొరవ వల్ల ఓ దాత ముందుకు రావడంతో ప్రాణాపాయ స్థితి తప్పింది.

వీరవాస్రం యండపల్లికి చెందిన వ్యక్తి(38)కి డెంగీ జ్వరంతో ప్లేట్‌లెట్లు పడిపోయాయి. పరిస్థితి విషమించింది. ఆయనది అరుదుగా దొరికే ఏబీ పాజిటివ్ గ్రూప్ కావడంతో అర్ధరాత్రి వేళ కాకినాడ యువసేన ఇన్‌ఛార్జ్‌కు ఫోన్ రాగా సత్వరం సకాలంలో దానమిచ్చారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం.. నేటికీ ఎందరో అత్యవసర వేళ ఇబ్బందులు పడుతున్నారు. రక్తనిధి కేంద్రాల్లో దొరికే వరకుగానే చాలామంది చూస్తున్నారు తప్ప.. దానమిచ్చేందుకు ముందుకు వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉంది. నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం. అపోహలు వీడి ముందుకొచ్చి దానం చేయడం ద్వారా పదుగురి ప్రాణాలు కాపాడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

గాంధీనగర్, మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 28 రక్తనిధి కేంద్రాలు (బ్లడ్ బ్యాంకులు) ఉన్నాయి. ప్రస్తుతం కాకినాడ జిల్లాలో రెండు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒకటి, మరో రెండు రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్‌ల నిర్వహిస్తున్నాయి. ఇంకో 6 ప్రైవేట్ రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో అమలాపురం, రాజోలు ప్రభుత్వాసుపత్రుల్లో ఒక్కోటి అమలాపురంలో 6 ప్రైవేట్‌వి ఉన్నాయి. తూర్పులో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఒకటి, ప్రైవేటు 9 నడుస్తున్నాయి.. ఇటీవల ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, చిరంజీవి వంటి నేతల, ప్రముఖుల జన్మదినోత్సవాలు, పలు సంస్థల వారోత్సవాల్లో శిబిరాలు ఏర్పాటు చేయడంతో కొంత కొరత తీరుతోంది. ప్రైవేటు కేంద్రాలు సేకరిస్తున్న రక్త నిల్వల్లో 30 శాతం ప్రభుత్వ రక్తనిధికి ఇవ్వాలనే నిబంధన ఉంది. ఏటా వేసవిలో మాత్రం సమస్య తీరడం లేదు. ఆ సీజన్‌లో తలసేమియా, డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. అందరిలోనూ చైతన్యం పెరిగితేనే రోగుల అవసరాలు తీరుతాయి.



కాకినాడ సూర్యకళా మందిరంలో మెగా రక్తదాన శిబిరం (పాతచిత్రం)

700 మందిని గుర్తించి..

సామాజిక మాధ్యమాల్లో రక్తదానం, దాతలపై అవగాహన కల్పిస్తూ సందేశాలతో కొంత అయోమయం నెలకొంటుంది. నెగెటివ్ గ్రూప్ దాతలు శిబిరాల్లో కాకుండా నేరుగానే బాధితులకు అందజేస్తుంటున్నారు. ఇది మంచి పరిణామమైనా ఒక్కోసారి రోగులకు దాతలు దొరక్క ఇబ్బంది ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలో అధికారులు నెగెటివ్ గ్రూప్ కలిగిన సుమారు 700 మందిని గుర్తించారు. వారిని అత్యవసర సమయాల్లో సంప్రదిస్తూ, కొరత తీర్చేందుకు కొంతవరకు కృషి చేస్తున్నారు.

జిల్లా	రక్తనిధి కేంద్రాలు
కాకినాడ	10
తూర్పుగోదావరి	10
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	8

గత మూడేళ్లలో ఉమ్మడి జిల్లాలో రక్తనిధి కేంద్రాల ద్వారా సేకరణ ఇలా..

సంవత్సరం	లక్ష్యం (యూనిట్లు)	సేకరణ	శాతం
2022-23	53928	79668	148
2023-24	53928	81642	151
2024-25	53928	26381	117

(ఆగస్టు 2024 నాటికి)

ప్రతి మూడు నెలలకు ఒకసారి..

కాకినాడ జీజీహెచ్‌లో రక్తం అవసరం ఉంది. రోడ్డుప్రమాదాలు, డెలివరీ కేసులు, మలేరియా, డెంగీ, విషజ్వరాలతో ఎక్కువగా రక్తం అవసరం. వారందరికీ అవసరం మేరకు రక్తం అందజేస్తున్నాం. 19 నుంచి 60 ఏళ్ల వయస్సు వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. ఆర్మీ, నేవీ సిబ్బంది ఎవరూ చెప్పకుండానే స్వచ్ఛందంగానే చేస్తారు. మనం కూడా అలా ఆలోచించి చేస్తే చాలావరకు కొరత తీరుతుంది.

-డా.శారదాదేవి, మెడికల్ అధికారిణి, కాకినాడ జీజీహెచ్

ఒకసారి దాత నుంచి రక్తం తీసుకుంటే 30 రోజుల వరకు నిల్వ ఉంచుకునే వెసులుబాటు ఉంది. ఒకరి నుంచి సేకరిస్తే రక్తం, ప్లేట్‌లెట్స్, ప్లాస్మా రూపంలో విడదీసి ఆపదలో ఉన్న ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చు.

ఇది ప్రతి ఒక్కరి బాధ్యత

రక్తదానాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. స్వచ్ఛంద రక్తదానాన్ని అన్ని సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ ప్రోత్సహించాలి. జిల్లాలో 20లక్షల మంది జనాభా కనీసం ఏటా 20వేల మంది రక్తదానం చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వారు మాత్రమే ఇస్తున్నారు. అలాకాకుండా కొత్తగా దాతలు ముందుకు రావాలి. నెగెటివ్ గ్రూప్ వారు అత్యవసర వేళ స్వచ్ఛందంగా స్పందించాల్సి ఉంది.

- రొంకిని రమేష్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

యానాం: యానాంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పారిశుద్ధ్య చర్యలపై అధికారులు దృష్టి సారించాలని ఆర్‌పి, సీడబ్ల్యూడీ ఈఈ, డీఎస్సీ అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం విన్నవించారు. భారీ వర్షాల నేపథ్యంలో పాఠశాలల ఆవరణలు మురికికూపాలుగా మారుతున్నాయని, విద్యార్థులు డెంగీ, టైఫాయిడ్, మలేరియా జ్వరాల బారినపడుతున్నారన్నారు. దసరా సెలవుల్లో పనుల చేపడితే తరగతులకు ఆటంకాలు ఉండవని కోరారు.

ఫలించని అన్వేషణ

- పులి కోసం మధ్యలంకలో గాలింపు
- రైతులను అప్రమత్తం చేసిన అటవీశాఖ



రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: చిరుతపులి కనిపించినట్టే కనిపించి మాయమైంది. ఇటు కడియపులంకలో, అటు కోనసీమలోనూ జాడ కానరావడం లేదు. దీంతో అటవీశాఖాధికారులు కొత్తపేట నియోజకవర్గంలో జల్లెడ పడుతున్నారు. రావులపాలెంలోని గౌతమి వంతెన సమీపంలో దీని ఆచూకీ ఎక్కడా కనిపించలేదని జిల్లా అటవీ శాఖాధికారి ఎం.వి.ప్రసాద్‌రావు తెలిపారు.



మధ్యలంక వద్ద బోటుపై పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆరు బృందాలుగా..

గౌతమి వంతెన మధ్యలంకలో నారాయణలంకకు చెందిన మత్స్యకారుడికి పులి కనిపించిందని సమాచారం రావడంతో అటవీ శాఖ అధికారులు సోమవారం ఆరు బృందాలుగా ఏర్పడి గాలించారు. మధ్యలంకలోకి డీఎఫ్‌ఓ, సిబ్బంది బోటుపై వెళ్లి పాదముద్రలు పరిశీలించారు. వంతెన పరిసర ప్రాంతాల్లోనూ డ్రోన్ కెమెరాతో చూశారు. డీఎఫ్‌ఓ మాట్లాడుతూ గత 25 రోజులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పులి కోసం గాలిస్తున్నామన్నారు. రావులపాలెం, ఊబలంక పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేశామని.. ఎక్కడా పాదముద్రలు, పులి తిరిగిన ఆనవాళ్లు లేవన్నారు. చిరుత దాడిలో కుక్క చనిపోయి ఉందని చెప్పడంతో వెళ్లి చూశామని.. అటువంటి జాడ ఏదీ కానరాలేదన్నారు. వేరే ప్రాంతాలకు చెందిన పాత వీడియోలను కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి వదంతులు సృష్టిస్తున్నారన్నారు. ఇటువంటివి పెడితే పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇద్దరు ముగ్గురు కలిసి..

ఉమ్మడి జిల్లాలో పులి తిరుగుతున్న నేపథ్యంలో లంక ప్రాంతాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో సూచించారు. లంకల్లోకి వెళ్లే సమయంలో ఇద్దరు ముగ్గురు కలిసి వెళ్లాలన్నారు. వెంట టార్చ్‌లైట్, కర్ర ఉండాలన్నారు. పులి ఏదైనా ఎదురుపడితే వెంటనే పారిపోకూడదని.. గట్టిగా అరుస్తూ వెనుకకు అడుగులు వేయాలన్నారు. ఏమైనా సమాచారం ఉంటే తమకు తెలియజేయాలన్నారు. రేంజ్ అధికారులు అమర్‌నాథ్, కె.దుర్గారామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెయ్యిపై ఏం తేలనుంది?

అన్నవరంలో సరకుల నాణ్యతపై పకడ్బందీగా పరీక్షలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో టెండర్ల ద్వారా కొనుగోలు చేసే సరకుల నాణ్యతపై మరింత పకడ్బందీగా పరిశీలన, పరీక్షలు చేయించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి, ఇతర సరకుల నాణ్యతపై రాష్ట్రంలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తమయ్యారు. అన్నదానం, వేద పాఠశాల, మహానివేదన, వ్రతాలు, ప్రసాదం తదితర వాటికి సరకులను ప్రతి ఆరు నెలలకోసారి జరిగే టెండర్లలో తక్కువ కోట్ చేసిన వారి నుంచి కొనుగోలు చేస్తున్నారు. వీటిని విజయవాడకు చెందిన ఆక్యురేట్ ప్రయోగశాలలో నాణ్యత పరీక్షలు చేయిస్తున్నారు. ద్వారకాతిరుమల, విజయవాడ ఆలయాలు దీనినే ఉపయోగించుకుంటున్నాయి. అవసరమైతే ఉన్నతాధికారుల ఆదేశాలతో ల్యాబ్‌ను మార్చే యోచనలో ఉన్నారు. కాగా పలు సరకులను జిల్లా ఆహార తనిఖీ అధికారులు పరీక్షలకు పంపారు. నెయ్యి, పంచదార, బెల్లం, పప్పులు, ఇతర సరకుల నమూనాలను సెప్టెంబరు 22న సేకరించారు. నెయ్యిని ప్రత్యేకంగా సెంట్రల్ ల్యాబ్‌కు పంపించారు. మరో పది, పదిహేను రోజుల్లో ఫలితాలు వచ్చే అవకాశముంది.



దేవస్థానానికి వచ్చిన సరకులు

కొనుగోలుపై రాని స్పష్టత

స్వామివారి ప్రసాదం తయారీకి నెయ్యి కొనుగోలుపై ఇంకా స్పష్టత రాలేదు. 2022 అక్టోబరు నుంచి 2024 సెప్టెంబరు వరకు నాలుగుసార్లు టెండర్లు దక్కించుకుని సరఫరా చేస్తున్న రైతు డెయిరీ గడువు సోమవారంతో ముగిసింది. అక్టోబరు 1 నుంచి కొత్త గుత్తేదారు ముందుకు వచ్చినా ఇంకా అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం వారం రోజులకు సరిపడా నెయ్యి దేవస్థానంలో నిల్వ ఉంది. ఈలోగా కొనుగోలుపై మార్గదర్శకాలు వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. లేదంటే ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా నెయ్యి కొనుగోలు చేస్తారు. మిగిలిన సరకులను అక్టోబరు 1 నుంచి సరఫరాకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు సమాచారం.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా..

నెయ్యి, ఇతర సరకుల కొనుగోలుపై దేవాదాయ శాఖ నుంచి ప్రత్యేక మార్గదర్శకాలు వచ్చే అవకాశముంది. దీనికి అనుగుణంగా సరకుల కొనుగోలుపై పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. నాణ్యత విషయంలో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. -కె.రామచంద్రమోహన్, ఈవో, అన్నవరం

పోషకాహార లోపం నివారణే లక్ష్యం



గర్భిణులకు కిట్లు అందిస్తున్న జేసీ నిశాంతి

అమలాపురం కలెక్టరేట్: మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపం నివారించేందుకు ఏటా సెప్టెంబరులో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నారని ఎంపీ హరీష్‌మాథుర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. జాతీయ కుటుంబ ఆరోగ్యసంస్థ సర్వే ప్రకారం సరైన ఆహారం తీసుకోకపోవడంతో మాతాశిశు మరణాలు సంభవిస్తున్నాయన్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమం చేపట్టాయన్నారు. జేసీ నిశాంతి మాట్లాడుతూ ఏడు ప్రాజెక్టుల పరిధిలో 1,726 కేంద్రాల్లో సీమంతాలు, అన్నప్రాసన జరిగాయన్నారు. గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల్లో రక్తహీనత నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 82,747 మంది లబ్ధి పొందుతున్నారన్నారు. సత్యనాగేంద్రమణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైకాపా మొండి గోడ.. కూటమితో ఇంటి జాడ!

– న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్



అల్లవరం మండలం గోడిలో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం పేరుతో గత వైకాపా ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరిదిద్దే పనిలో నిమగ్నమైంది. ఆ ఇళ్లకు రూపం ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. వాస్తవానికి ఈ పథకంలో ఒక్కో ఇంటికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుండగా వైకాపా ప్రభుత్వం అన్నీ తామే ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంది. గ్రామాల్లో ఇళ్లు కాదు.. జగనన్నకాలనీల పేరుతో ఊళ్లు నిర్మిస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ ప్రభుత్వం క్షేత్ర స్థాయికి వచ్చేసరికి చేతులెత్తేసింది. మొండి గోడలతో వదిలేసింది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మరింత మేలు చేసే చర్యలు ఆరంభించింది. ప్రతి గ్రామంలో 'మన ఇళ్లు-మన గౌరవం' పేరుతో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

మార్చి తరువాత పీఎంఏవై 2.0

కేంద్ర ప్రభుత్వం 2025 మార్చి తర్వాత పీఎంఏవై 2.0 కార్యక్రమం అమలు చేయనుంది. పీఎంఏవై 1.0 పథకంలో ఇళ్లు మంజూరైనవారికి మళ్లీ కేటాయించే వీలులేదు. ఉన్న స్థలంలోనే ఇల్లు నిర్మించుకోవాలని, గడువులోగా పూర్తి చేయకుంటే బిల్లులు రావని వివరించడంతోపాటు నిర్మాణాలు చేపట్టేలా ప్రయత్నం చేస్తున్నారు. దీనికోసం జిల్లావ్యాప్తంగా ప్రత్యేకంగా అధికారులను నియమించారు.

ప్రత్యేకాధికారులు వీరే..

అమలాపురం: ఆర్డీవో కె.మాధవి
ముమ్మిడివరం: ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి
రాజోలు: డీపీవో రాంబాబు
పి.గన్నవరం: డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్
కొత్తపేట: మార్కెటింగ్ అధికారిణి విశాలాక్షి
రామచంద్రపురం, మండపేట: డ్వామా పీడీ మధుసూదన్

సగం కూడా కాలేదు..

జిల్లాలోని 242 లేఔట్ల పరిధిలో 25,703 మంది లబ్ధిదారులకు స్థలాలిచ్చారు. ఇప్పటివరకు 10,051 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. మిగిలినవాటిలో 4,945 ఇళ్లను ప్రారంభించనే లేదు. 10,707 ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఈ లేఅవుట్‌లలో మౌలిక వసతులు, నిర్మాణాలకు ఇప్పటివరకు రూ.240.96 కోట్లు ఖర్చు చేశారు. వీటిని వచ్చే మార్చినాటికి పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ అమలు చేస్తున్నారు.

వివరాలు ఇవీ..

నియోజకవర్గం	లేఔట్లు	లబ్ధిదారులు	పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్నవి	మొదలు పెట్టనివి	వ్యయం (రూ.కోట్లలో)
అమలాపురం	37	4,159	737	1,337	2,085	21
ముమ్మిడివరం	26	3,124	1,321	768	1,035	2.98
పి.గన్నవరం	5	48	16	32	0	0.37
రాజోలు	17	948	627	321	0	11.75
కొత్తపేట	15	1,943	1,633	222	88	26.80
రామచంద్రపురం	75	6,068	2,157	2,944	967	53.60
మండపేట	67	9,413	3,560	5,083	770	97.58

గడువులోపు చేయిస్తాం..

జిల్లాలోని లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు మార్చి నెలాఖరుకు పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం. లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యం చేరుకునే విధంగా కృషి చేస్తాం.

- మదన్‌మోహన్, గృహ నిర్మాణశాఖ జిల్లా అధికారి

రైతేరాజు అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

కలెక్టర్ పేరు చెప్పి.. సొమ్ము కాజేసేయత్నం

తహసీల్దార్లకు సైబర్ నేరస్థుడి వాట్సాప్ సందేశం

ఈనాడు, కాకినాడ: 'హలో.. ఎలా ఉన్నారు...? ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు..? నేను చాలా కీలకమైన సమావేశంలో ఉన్నాను. మాట్లాడలేని పరిస్థితి.. నేను చెప్పిన ఖాతాకు రూ.50 వేలు పంపించండి.. సమావేశం ముగిశాక.. ఈరోజు మీకు ఆ మొత్తాన్ని తిరిగి పంపించేస్తాను' ఇదీ కాకినాడ జిల్లాలో పలువురు తహసీల్దార్ల చరవాణిలకు సోమవారం వచ్చిన వాట్సప్ సందేశం. డీపీలో చిత్రం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ది ఉండటం.. ఫోన్‌నంబర్ వేరేగా ఉండడంతో అనుమానంతో ఆరాతీస్తే అది ఫేక్ సందేశమని, సైబర్ నేరస్థుడి వలగా తేలింది. ఇలాంటి తప్పుడు సందేశాలకు ఎవరూ స్పందించవద్దని, డబ్బులు పంపించొద్దని జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సివచ్చింది. ఫేక్ మెసేజ్ +998881942520 నంబరుతో శంఖవరం, తొండంగి తదితర తహసీల్దార్లకు వెళ్లడంతో విషయాన్ని ఎస్పీతోపాటు, సైబర్ విభాగం దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. ఈ ఏడాది ఆగస్టు 20న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చిత్రంతో వాట్సప్ కాల్ ఏకంగా జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుకు వెళ్లడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఆ నంబరు శ్రీలంకకు చెందినదిగా గుర్తించారు.

దోషులను కఠినంగా శిక్షించండి



నిరసన తెలుపుతున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

తిరుమల తిరుపతి మహా ప్రసాదం లడ్డూను అపవిత్రం చేసిన దోషులను తక్షణం కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తిరుపతి లడ్డూ ప్రసాదం అంటే దేశవ్యాప్తంగా కోట్లాది మందికి అమితమైన భక్తి, గౌరవం ఉందని, వాటిని పాడు చేయాలని చూసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు వెంకట్, సాంబయ్య, శిరంగు నాయుగు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

కనీస వేతనచట్టం అమలుకు డిమాండ్

ప్రభుత్వ శాఖల్లో ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతన చట్టం అమలు చేయాలని ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నవారికి రూ.26 వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగలక్ష్మి, బలరాం, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్



కలెక్టరేట్ ఎదుట నిరసనలో సీఐటీయూ నాయకులు

చెరువుల సంరక్షణకు వినతి



ఎంపీ హరీష్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ కారణంగా అమలాపురం నియోజకవర్గానికి సంబంధించిన 12 గ్రామాలకు మంచినీరు సరఫరా చేసే ఆర్‌డబ్ల్యూఎస్ పథకం దెబ్బతింటుందని ఆయా గ్రామాల సర్పంచులు తెలిపారు. రైల్వేలైన్‌పై అమలాపురంలోని ఎంపీ హరీష్‌మాథుర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ సానుకూలంగా స్పందించి రైల్వే అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్తానని హామీ ఇచ్చారన్నారు. చిందాడగరువు సర్పంచి గణేష్ మాట్లాడుతూ రోళ్లపాలెంలో అమలేశ్వరస్వామి ఆలయం వద్ద పుష్కర ఉత్సవాలకు ప్రతీకైన చెరువును కాపాడాలన్నారు. రైల్వేలైన్‌కు ప్రత్యామ్నాయం చూడాలని కోరారు. రేలంగి దుర్గారావు, మట్టా సాయిరామారావు, గంగుమళ్ల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

హాకీ టోర్నమెంటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉప్పలగుప్తం: న్యూ దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ హాకీ టోర్నమెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శివాజీ స్టేడియంలో అక్టోబరు 4 నుంచి జరిగే టోర్నమెంటులో ఆడటానికి జిల్లానుంచి ఆసక్తి ఉన్న పాఠశాలల జట్లు దరఖాస్తులకు తమను సంప్రదించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్‌కుమార్ సోమవారం కోరారు. బాలయోగి స్టేడియంలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కలెక్టరేట్‌కు 230 అర్జీలు

అమలాపురం కలెక్టరేట్: కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యలపై అర్జీలిస్తున్న దివ్యాంగుల పట్ల సానుకూల దృక్పథం కలిగిఉండాలని జేసీ నిశాంతి అధికారులకు తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగుల చెంతకు జేసీ నేరుగా వెళ్లి సమస్యలు తెలుసుకుని తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో 230 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



దివ్యాంగుల వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుంటున్న జేసీ

సమస్యలు పరిష్కరిస్తాం..

అమలాపురం పట్టణం: ప్రజల ఫిర్యాదులపై సత్వరం విచారణ చేసి పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. అమలాపురంలోని కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఛాంబర్‌లో ఎస్పీ 21 మంది నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వివరాలు తెలుసుకున్నారు. అమలాపురం మండలం కామనగరువుకు చెందినవారు కామన పుణ్యవతి తన మనవడు ఇంట్లోకి రానివ్వడం లేదని, అయినవిల్లికి చెందిన శ్రీనివాసరావు తనపై కుటుంబసభ్యులు దాడి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. రావులపాలెంలో ప్రభుత్వం తనకు స్థలం ఇచ్చిందని, దానిని వేరొకరు ఆక్రమించారని కె.రమణి ఫిర్యాదు చేశారు. స్థలం గొడవ, భూతగాదా, అప్పు తిరిగి ఇప్పించాలని పలువురు చెప్పుకొన్నారు.

నా భర్తను హత్య చేశారు..



అయినవిల్లికి చెందిన నా భర్త జనుపల్లి దుర్గాప్రసాద్‌ను హత్య చేశారు. స్నేహితులతో ద్విచక్ర వాహనంపై వెళ్లారని స్థానికులు చెప్పారు. కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నాం. కేసును వెంటనే విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలి. - జనుపల్లి శ్రావణి సంధ్య

అబ్కారీ శాఖ అధికారులతో సమీక్ష

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న మద్యం పాలసీ అమలుకు ఎక్సైజ్ అధికారులు సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. సోమవారం మద్యం విధానంపై ఆయన అబ్కారీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఆరు సర్కిల్‌లలో దరఖాస్తులు స్వీకరించేందుకు సిబ్బందిని నియమించాలన్నారు. బ్యాంకు అధికారులు దరఖాస్తుదారులు ఇచ్చే డీడీలు, చెక్కులు సక్రమమైనవేనా అని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. శాంతియుత వాతావరణంలో ప్రక్రియ పూర్తి చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 150 మద్యం దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఎస్పీ కృష్ణారావు, జేసీ నిశాంతి, ఎక్సైజ్ అధికారి అమర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

చిగురించిన 'సందేశం'



జీవితంలో కష్టాలు వస్తూ, పోతూ ఉంటాయి. ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా కుంగిపోకుండా నిలబడితేనే విజయం వరిస్తుంది. సరిగ్గా ఈ చిత్రం అదే సందేశాన్ని ఇస్తోంది. నీడనిచ్చే తనను గొడ్డలి వేటుతో నరికేసినా, తిరిగి చిగురిస్తోంది. కష్ట, నష్టాలు ఎదురైనపుడు చివరి నిమిషం వరకు ఆశలు కోల్పోకూడదని ఈ అవెన్యూ లేదా స్కాలర్ (సాంకేతిక నామం అలస్టోరియా స్కాలరీస్) చెట్టు చెప్పకనే చెబుతోంది. కపిలేశ్వరపురం మండలం అంగరలోని ఈ దృశ్యం 'న్యూస్‌టుడే' కెమెరా కంటపడింది.

- న్యూస్‌టుడే, అంగర

స్వచ్ఛంద తోవ



రామరాజులంక శివారు పెదతిప్ప రోడ్డు శిథిలమై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో స్థానికులే స్వచ్ఛందంగా బాగు చేసుకున్నారు. ఇక్కడి రోడ్డు బాగా పాడైంది. అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో ప్రజలు రూ.50 వేల నిధులను సమకూర్చుకున్నారు. రాళ్లు, కంకర తెచ్చి జేసీబీతో రహదారిని అభివృద్ధి చేసుకున్నారు. సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు నల్లి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నల్లి శివ, తిరుమల బాబి, గవరాజు, ఏలియా, రామకృష్ణ, మోహనరావు, మధు తదితరులు సహకరించారు.

- న్యూస్‌టుడే, మలికిపురం

పట్టభద్రులకు ఓట్ల పండగ

నమోదుకు నవంబరు 6 వరకు అవకాశం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటు నమోదుకు సోమవారం ప్రకటన జారీ చేశారు. ఇదే రోజు నుంచి అర్హులైన పట్టభద్రులు నవంబరు 6 వరకు ఓటు నమోదు చేసుకునేలా అవకాశం కల్పించారు. ఈ నియోజకవర్గం పరిధిలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అర్హుల నుంచి ఫారం-18 ద్వారా ఓటుకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నవంబరు 23న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అదే రోజు నుంచి డిసెంబరు 9 వరకు మళ్లీ అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. వీటిపై డిసెంబరు 25 నాటికి విచారణ పూర్తి చేసి, ఆ నెల 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. దీని ఆధారంగా ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు.



ఈఆర్వో కార్యాలయంలోని ఎన్నికల విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇవీ అర్హతలు

- ఉభయగోదావరి జిల్లాల్లో నివాసిగా ఉండాలి
- ఈ ఏడాది నవంబరు 1 నాటికి మూడేళ్ల ముందు డిగ్రీ ఉత్తీర్ణులు

మార్చి 29 వరకు ఐవీ పదవీ కాలం: ప్రస్తుత ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు(ఐవీ) పదవీ కాలం 2025, మార్చి 29తో ముగియనుంది. 2019, మార్చి 22న జరిగిన ఎన్నికల్లో ఆయన సమీప ప్రత్యర్థి శేషారెడ్డిపై మొదటి ప్రాధాన్య ఓటుతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో 46 మంది పోటీ చేశారు.

2019 ఎన్నికల్లో ఓటర్లు

మొత్తం ఓటర్లు	2,93,794
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఓటర్లు	1,72,415
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఓటర్లు	1,21,379
పోలింగ్ కేంద్రాలు	293
ఉమ్మడి తూర్పుగోదావరి	166
ఉమ్మడి పశ్చిమగోదావరి	133

దరఖాస్తు ఇలా

- కార్యాలయాల్లో ఫారం-18 దరఖాస్తు పొందాలి
- గజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేసిన డిగ్రీ ధ్రువపత్రం నకలు జత చేయాలి
- రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు అతికించాలి
- ఆధార్ కార్డు నకలు, నివాస ధ్రువీకరణ పత్రం జత చేయవచ్చు
- కాకినాడ కలెక్టరేట్‌లోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్వో) కార్యాలయంతో పాటు సబ్‌కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు.
- ceoandhra.nic.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేయవచ్చు

అర్హులంతా నమోదు చేసుకోవాలి

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి. గత ఎన్నికల్లో ఉన్న ఓటర్ల జాబితా ఇప్పుడు పనికి రాదు. ఈ నియోజకవర్గం పరిధిలో గుర్తింపు పొందిన కార్యాలయాల్లో 3 లక్షల ఫారం-18 దరఖాస్తులు సమకూర్చాం. వీటిని ఆయా కార్యాలయాల్లో తీసుకుని అక్కడే అందజేయాలి. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేయవచ్చు. ఏక మొత్తంగా ఇచ్చే దరఖాస్తులను స్వీకరించరు. ఏదైనా కార్యాలయంలో పనిచేసే అర్హులైన ఓటర్లు అక్కడి అధికారి ధ్రువీకరణతో బల్క్‌గా దరఖాస్తులు ఇచ్చినా అనుమతిస్తాం.

- డి.తిప్పేనాయక్, ఈఆర్వో, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి

సత్యదేవుని హుండీ ఆదాయం రూ. 78.54 లక్షలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామి హుండీ ఆదాయం రూ.78.54 లక్షలు సమకూరింది. ఛైర్మన్ రోహిత్, ఈవో కె.రామచంద్రమోహన్ సమక్షంలో సోమవారం హుండీలను తెరచి లెక్కించారు. గత 28 రోజులకు రూ. 78,54,428 ఆదాయం వచ్చింది. ఇందులో నగదు రూ. 75,38,066, చిల్లర రూ.3,16,362 ఉంది. 31 గ్రాముల బంగారం, 453 గ్రాముల వెండి ఆభరణాలు కానుకల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు.



కలెక్టరేట్ వద్ద నినదిస్తున్న గోపాలపురం గ్రామస్థులు

బహిష్కరించి.. వేధిస్తున్నారని నిరసన

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన దళితులమైన తమను సంఘ బహిష్కరణ చేసి వేధిస్తున్నారని సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ 2022లో తమ గ్రామానికి చెందిన దళిత సంఘం నుంచి 60 కుటుంబాలను వెలివేశారన్నారు. దీనిపై అప్పట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఏ విధమైన చర్యలు తీసుకోలేదని వాపోయారు. సంఘం పరిధిలో ఉన్న భూమికి వచ్చే శిస్తు ద్వారా బియ్యం కొనుగోలుచేసి పనులు లేని సమయంలో ఒక్కొక్క కుటుంబానికి 32 కేజీల చొప్పున పంపిణీ చేస్తారని, మూడేళ్లుగా తమ కుటుంబాలకు ఇవ్వకుండా బహిష్కరిస్తున్నారన్నారు. బహిష్కరణ తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ సర్పంచి సబిత, ప్రకాశం, ఏసు, కుమారి, రాజేశ్వరి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒండ్రుమట్టితో భూసారం పెరుగుదల

రైతేరాజు

మీ కోసం

పి.గన్నవరం: గోదావరి వరదలు లంకగ్రామాల ప్రజలను, రైతులను ఇబ్బందికి గురిచేస్తుంటాయి. అయితే వరదనీటిలో కొండల నుంచి కొట్టుకొచ్చిన మట్టి డెల్టాభూముల్లో ఒండ్రుమట్టిగా పోయడంతో భూసారం బాగా పెరుగుతుంది. దీంట్లో సహజసిద్ధమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయని కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రకృతి వ్యవసాయ సాగు ప్రాజెక్టు మేనేజర్ ఎలియాజర్ వివరించారు. ఈ ఒండ్రుమట్టి భూసారాన్ని బాగా పెంచుతుందన్నారు. ప్రధానంగా నాలుగు రకాల పోషకాలు ఉంటాయి

1) స్థూల పోషకాలు: నత్రజని, భాస్వరం, పొటాష్ కలిసి ఉంటాయి.

2) ద్వితీయ పోషకాలు: కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్ మిళితమై ఉంటాయి

3)సూక్ష్మ పోషకాలు: జింక్, ఇనుము, మాంగనీస్, రాగి ఉంటాయి.

4)అతిసూక్ష్మ పోషకాలు: బోరాన్, మేలిబ్డీనియం, నికెల్, కోబాల్ట్, సోడియం సమపాలల్లో ఉంటాయి.



కొబ్బరితోటల్లో వరదనీరు... దీంట్లోనే సారవంతమైన ఒండ్రుమట్టి కలిసి ఉంటుంది

రైతులు ఇలా చేయాలి

వరదనీరు పూర్తిగా తొలగిన తరువాత కొబ్బరితోటల్లో పైపాటుగా దుక్కిదున్ని నవధాన్యాల విత్తనాలు మిశ్రమంగా లేదా లైన్‌షోయింగ్(విడిగా) చల్లాలి. వీటితో భూసారం మరింత పెరుగుతుంది. ఇలా చేస్తే ఏడాదిపాటు ఎలాంటి ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదని ఎలియాజర్ సూచించారు.

వరిలో ఎండాకు తెగులును అరికడదాం

తెలుసుకుందాం..

చాగల్లు, అనపర్తి గ్రామీణం న్యూస్‌టుడే

అధిక వర్షాల కారణంగా వరి పంటపై ఎండాకు తెగులు వ్యాపిస్తుంది. ఈ తెగులు నివారణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, అనపర్తి ఏవో సురేష్‌కుమార్ తెలిపారు.

- **తెగులు నిర్ధారణ ఇలా:** ఎండిన ఆకులు చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి నీటితో ఉన్న గాజుగ్లాసులో వేయాలి. తెగులు సోకిన భాగాల నుంచి బ్యాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వల్ల కొన్ని గంటల తరువాత నీటి గాఢత పెరిగి, పసుపు రంగుకు మారడం జరుగుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటకు ఎండాకు తెగులు ఆశించినట్లు గుర్తించవచ్చు.
- **నివారణ చర్యలు:** బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు 5శాతం కంటే ఎక్కువగా ఉంటే, పై పాటుగా వేసే నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలిపివేసి, ఎండలు కాసిన తరువాత మాత్రమే వేయాలి. సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా వేయాలి. తెగులు వ్యాప్తిని కొంత వరకు అరికట్టడానికి లీటరు నీటికి 0.5-1 గ్రాముల స్ట్రెప్టోమైసిన్ ,టెట్రాసైక్లిన్ హైడ్రో క్లోరైడ్, కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తిస్తే, దాని నివారణకు ఒక లీటరు నీటిలో ఎసిఫేట్ 1.5గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3మీ.లీ పిచికారీ చేయాలి.

పెట్టుబడి తగ్గించి.. ఆదాయం పెంచి

స్ఫూర్తి

ఉప్పలగుప్తం: వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులను తగ్గించి నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు అన్నదాతలు కృషి చేస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పాటు జనుము, జీలుగ, పిల్లిపెసర, వంటి పైర్లను సాగు చేస్తున్నారు. ఉప్పలగుప్తం మండలం విలసవిల్లికి చెందిన రైతు జి.రామకృష్ణ రసాయన రహిత సాగు చేస్తున్నారు. తనకున్న ఎకరం పొలంలో వరితో పాటు, పొలం గట్లపై వంకాయ, అనప, చిక్కుడు, ఆకు కూరలను పండిస్తున్నారు.

ఆరోగ్యకరమైన సాగు..

[illegible] సేంద్రియ సాగు చేస్తున్నారు. పచ్చిరొట్ట పైరును పూతదశలో చేలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుంది. ఆవులు, గేదెలను కొనుగోలు చేశారు. వాటి పేడ, మూత్రాలతో ద్రవ రూప జీవ ఎరువులు, జీవామృతం, బీజామృతం, ఘనజీవామృతం, పంచగవ్య, ఉల్లికషాయం వంటి వాటిని వివిధ దశల్లో వాడి వరిసాగు చేపట్టారు. వరిలో అజొల్లాను చల్లడం ద్వారా కలుపు తగ్గింది. లింగాకర్షణ బుట్టలు, జిగురు అట్టల ద్వారా వరి చేనుకు హానికలిగించే కీటకాలను, దోమలను చాలా వరకూ నివారించ గలిగారు.

తోటి రైతులకు వివరిస్తున్నా...

ధాన్యాన్ని దగ్గరలోని మిల్లుద్వారా దంపుడు బియ్యంగా ఆడించి చుట్టుపక్కల గ్రామాల వారికి విక్రయిస్తున్నా. ఎకరాకు సుమారు రూ.15వేల పెట్టుబడితో రూ.50 వేల వరకు లాభం వస్తుంది. పొలం గట్లమీద పండించిన కూరగాయలు, ఆకు కూరలను ఇంటి అవసరాలకు పోను గ్రామంలో వారికి అమ్ముతున్నా. తక్కువ పెట్టుబడితో ఏటా దిగుబడి పెరుగుతూ వస్తుంది. సమీప రైతులు సాగు గురించి వివరాలు ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని వారికి వివరిస్తున్నా.

- జి.రామకృష్ణ, వరిరైతు, విలసవిల్లి



రైతుతో కలిసి జీవామృతం తయారు చేస్తున్న రైతు రామకృష్ణ

ప్రశ్న సమాధానం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే



ప్రస్తుతం గోదావరి వరద తగ్గుముఖం పట్టినందున లంక గ్రామాల పశుపోషకులు పశువుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు **పుట్టా వీరవెంకట సుబ్బారావు** సూచించారు. పశుపోషకులు అడిగిన ప్రశ్నలకు పలు సూచనలిచ్చారు.

ప్రశ్న: జీవాల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులకు ఏం చర్యలు తీసుకోవాలి ?

- ఎం.సోమన్న, కట్టుంగ

సమాధానం: జీవాలకు చీడపారుడు, నీలి నాలుక, చిటుకు వంటి వ్యాధులు సోకవచ్చు. నీలి నాలుక వ్యాధి సోకిన జీవాల నాలుక నీలిరంగులోకి మారి వాపు వచ్చి జ్వరం వస్తుంది. ఏడాదికొకసారి బ్లూటంగ్ టీకా వేయిస్తే ఈ వ్యాధి సోకదు. చీడపారుడుకు నాలుక, చిగుళ్ల మీద పుండ్లు ఏర్పడి విరేచనాలు అవుతాయి. నీరసంగా ఉండి చనిపోయే ప్రమాదం ఉంది. రోగం గమనించి యాంటిపైరెటిక్ ఇంజక్షన్లు ఇప్పించాలి.

ప్రశ్న: దూడల్లో తెల్లవిరేచనాలవుతున్నాయి. నివారణ ఎలా?

- సత్యనారాయణరాజు, ఆత్రేయపురం

సమాధానం: దూడ పుట్టిన 12-18 గంటల తర్వాత తెల్ల విరేచనాలు అవుతుంటాయి. నివారణకు యాంటీ బయోటిక్ పౌడర్ అందించాలి. సెలైన్ లివర్ మందులు వాడాలి. జావ తాగించాలి. 10 కిలోల బరువున్న దూడకు ఒక లీటరు చొప్పున పాలు పట్టించాలి.

అరటి మార్కెట్ వెలవెల

అంబాజీపేట, న్యూస్‌టుడే: అరటికి పెద్దగా డిమాండ్ లేకపోవటంతో అంబాజీపేట అరటి మార్కెట్ వెలవెలబోయింది. గత నెల వరకు ఆశాజనకంగానే ఉన్న అరటి ధరలు ఇప్పుడు బాగా తగిపోయాయి. మొన్న గోదావరికి వచ్చిన వరదలు... అధిక వర్షాలకు అరటిపంట కొంత మేర నష్టపోవటంతో నాణ్యమైన అరటిగెలలు మార్కెట్‌కు రాని పరిస్థితి. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన గెలలకు చాలా తక్కువ ధర వస్తుందని వాపోతున్నారు. నెల రోజుల క్రితం ఉన్న ధర ఇప్పుడు రావడంలేదంటున్నారు. ప్రస్తుతం కోనసీమలోని అంబాజీపేట అరటిమార్కెట్‌లో ధరలు క్షీణించాయి. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాలకు ఎగుమతులు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. అరటి ధరలు పెరుగుదలకు పండుగలు దోహదం చేస్తాయి. దీంతో రానున్న దసరా, దీపావళి, కార్తిక మాసం పర్వదినాలపైనే కర్షకులు ఆశలు పెట్టుకున్నారు.



అంబాజీపేట మార్కెట్

ఇదీ ధరల తీరు (గెల ఒక్కింటికి)

రకం	నెల రోజుల క్రితం	ప్రస్తుతం
కర్పూర	220–350	110–270
చక్రకేళి	140–300	140–280
అమృతపాణి	120–270	120–250
పచ్చఅరటి	100–220	100–200

సమస్యల పరిష్కారానికి వినతి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛమిస్తున్న సొసైటీ ఉద్యోగులు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: జిల్లా సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ నాయకులు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావును సోమవారం కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, 2019 తర్వాత నియమించిన ఉద్యోగులను తొలగించవద్దని తదితర సమస్యలు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని వారు హామీ ఇచ్చారన్నారు. పి.సత్యనారాయణ, రామచంద్రరావు, రామలింగేశ్వరరావు, జయరాం, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళను కొట్టి, దుర్భాషలాడిన.. మాజీ ఎంపీటీసీ

మండపేట గ్రామీణం: మహిళను కొట్టి, దుర్భాషలాడిన కేసులో ఎంపీటీసీ మాజీ సభ్యుడు, మండల ఆర్బీకే ఛైర్మన్, వైకాపా నాయకుడు అన్నందేవుల చంద్రరావును అరెస్ట్ చేసినట్లు మండపేట రూరల్ ఎస్సై సురేష్‌బాబు సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం.. చంద్రరావు తనను కొట్టి, దుర్భాషలాడాడని కేశవరానికి అంకం మంగాదేవి ఈ నెల 20న ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చంద్రరావును అరెస్ట్ చేసి రామచంద్రపురం కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించడంతో రామచంద్రపురం సబ్‌జైల్‌కు తరలించినట్లు తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

విదేశీ కరెన్సీ విక్రయం పేరుతో లూటీ

మొగల్తూరు, న్యూస్‌టుడే: విదేశీ కరెన్సీ నోట్లు విక్రయిస్తామని చెప్పి ఒక వ్యక్తి నుంచి రూ.2లక్షలు లూటీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేశామని ఏఎస్సై యు.రాజేంద్ర తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన రాపాక చంద్రరావు విదేశాల నుంచి వచ్చిన వారినుంచి కరెన్సీ, సామగ్రి కొనుగోలు, విక్రయ వ్యాపారం నిర్వహిస్తారు. గత నెల 29న గుర్తుతెలియని వ్యక్తులు రామచంద్రరావు చరవాణికి ఫోన్ చేసి తమ వద్ద విదేశీ కరెన్సీ నోట్లు ఉన్నాయని నమ్మబలికారు. దీంతో ఆయన తన వెంట రూ.2 లక్షలు తీసుకుని వారు తెలియజేసిన ప్రాంతానికి సోమవారం ఉదయం వెళ్తుండగా పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం సీతారామపురం- రాజుగారితోట మార్గంలో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు రామచంద్రరావుపై దాడిచేశారు. అతని వద్ద నుంచి రూ.2 లక్షలు లాక్కుని ఉడాయించారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఏఎస్సై తెలిపారు.

బీవోఎస్ ఛైర్మన్‌గా సుబ్బారావు

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయంలో యూజీ, పీజీ(ఎడ్యుకేషన్) బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీవోఎస్) ఛైర్మన్‌గా ప్రొ. కొండ్రు సుబ్బారావు నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను సోమవారం వీసీ వై.శ్రీనివాసరావు ఆయనకు అందజేశారు. బీవోఎస్‌లో ఛైర్మన్ కాకుండా మరో తొమ్మిది మంది సభ్యులను నియమించారు. వీరి పదవీ కాలం మూడు సంవత్సరాలు. సుబ్బారావు ప్రస్తుతం నన్నయలో బీఈడీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్నారు.

చెరువుల తొలగింపు పనులు నిలుపుదల చేయాలి

అమలాపురం కలెక్టరేట్: మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల పరిధిలో సముద్ర తీరం వెంట ఉన్న రొయ్యల చెరువుల తొలగింపు పనులు నిలుపుదల చేయాలని సంబంధిత రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గ పరిధిలో సముద్రం సుమారు కిలోమీటరు మేర ముందుకు వచ్చిందని, ఈ క్రమంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన సీసీరోడ్లు సైతం సముద్ర గర్భంలో కలిసిపోయిందన్నారు. సముద్రానికి చేరువగా ఉండే తమ జిరాయితీ భూములు చౌడుబారి వ్యవసాయానికి అనుకూలంగా లేవని తెలిపారు. దీంతో తమ భూములను ఆక్వా చెరువులుగా మార్పు చేసుకుని వాటిపై జీవనం సాగిస్తున్నామని, ప్రస్తుతం అధికారుల చర్యలతో తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమ చెరువులు ధ్వంసం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జి.లక్ష్మణరావు, సత్యనారాయణ, రాము, పోతుల కిశోర్, నాగరాజు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ ట్యాంకరు సీజ్

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: యానాం నుంచి అంబాజీపేటకు అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకరును ఐ.పోలవరం పోలీసులు సోమవారం సీజ్ చేశారు. రూ.6 లక్షల విలువ చేసే 5500 లీటర్ల డీజిల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు డ్రైవర్‌నూ అదుపులోకి తీసుకున్నామని ఎస్సై టి.శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యానాం మద్యం స్వాధీనం

అయినవిల్లి, న్యూస్‌టుడే: యానాం నుంచి అక్రమంగా కృష్ణా జిల్లాకు రవాణా చేస్తున్న వాహనాన్ని పట్టుకుని 192 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని మడుపల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. అంబాజీపేట సీఐ భీమరాజు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి యానాం నుంచి కారులో మద్యం సీసాలు కృష్ణా జిల్లాకు అక్రమంగా తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. పోలీసులకు సమాచారం తెలియడంతో మడుపల్లిలో అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి సుమారు రూ.52,880 విలువ గల 192 మద్యం సీసాలు, వాహనాన్ని అదుపులోకి తీసుకుని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంబాజీపేట ఎస్సై చిరంజీవి, ఏఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది రాము, శ్రీను, రామ్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో బస్సు డ్రైవర్‌కి జైలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం మండలం భట్నవిల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ చవ్వాకుల శ్రీధర్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.6 వేల జరిమానా విధించినట్లు అమలాపురం పట్టణ సీఐ వీరబాబు సోమవారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2017లో కాకినాడ మండలం ఇంద్రపాలేనికి చెందిన కర్రి శ్రీనివాస్(16), కర్రెడ్ల వీరబాబు(25) ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఆర్టీసీ బస్సుడ్రైవర్ చవ్వాకుల శ్రీధర్ ఆ వాహనాన్ని ఢీకొట్టారు. గాయపడిన వారిద్దరిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చేర్చగా, చికిత్సపొందుతూ కర్రెడ్ల వీరబాబు మృతి చెందాడు. కర్రి శ్రీనివాస్ ఫిర్యాదుతో అప్పటి రూరల్ ఎస్ఐ గజేంద్రకుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. ఈ కేసును ఏపీపీ రాజశేఖర్ వాదించగా నేరం రుజువు కావడంతో అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి గౌరీశంకర్ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో శ్రమించిన సీఐ వీరబాబు, ఎస్సైలు గజేంద్ర, శేఖర్‌బాబు, కానిస్టేబుల్ సత్యనారాయణలను ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

నాఫెడ్ నగదు కోసం ఎదురుచూపు

అంబాజీపేట: అంబాజీపేట, కొత్తపేట కొబ్బరి కొనుగోలు కేంద్రాల్లో కొబ్బరిని విక్రయించిన రైతులు నగదు కోసం ఎదురు చూస్తున్నారు. కొబ్బరిని విక్రయించిన 21 రోజుల్లోనే రైతులకు సొమ్ము చెల్లించాల్సి వుంది. ఇప్పటికే సుమారు రెండు నెలలు గడిచినా ఖాతాలకు జమకాలేదు. ఈ రెండు కేంద్రాల్లోనూ రూ.5,30,88,120 బకాయిలు రైతులకు రావాల్సి వుంది.

దసరా ఉత్సవాలకు శ్రీకారం

పి.గన్నవరం: రెండురోజుల్లో ప్రారంభం కానున్న దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలో వాడ వాడలా ఉత్సవ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పి.గన్నవరం, తాటికాయలవారిపాలెం, పప్పులవారిపాలెం, ముంగండ, నరేంద్రపురం, మానేపల్లి, కె.ముంజవరం, నాగుల్లంక, తదితర గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాలవద్ద కమిటీల ఆధ్వర్యంలో విద్యుత్తు దీపాలంకరణతో కూడిన పందిళ్లు ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రావులపాలేంకు చెందిన మేడపాటి భీమారెడ్డి భవాని దంపతులు సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. వీరికి దేవస్థాన డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధరరావు స్వామి వారి చిత్రపటం అందజేసి అభినందించారు.


దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న డీసీ చక్రధరరావు

కొర్లపాటివారిపాలెం రహదారికి మోక్షం

ఈనాడు స్పందన

అంబాజీపేట: అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెం రహదారికి మోక్షం కలిగింది. 2004లో ఇక్కడ రహదారిని నిర్మించారు. ఇక్కడ రహదారి గుంతలు పడి వర్షంనీరు నిలిచిపోతుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి పరిస్థితిపై గతంలోనే ఈనాడు అనేక కథనాలు ప్రచురించింది. మళ్లీ తాజాగా 'ప్రమాదం అంచున ప్రయాణం' అనే శీర్షికతో ఈనాడులో సోమవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఇంజినీరింగ్ అధికారులు ఇక్కడ రహదారి నిర్మాణానికి రూ.10 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, తెదేపానేత వెంకటసుబ్బారావులు కృషి చేశారు. ఈ రహదారి పనులు త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పైపులైనుకు మరమ్మతులు

స్పందనకు వందనం

మామిడికుదురు: మండలంలోని మాకన పాలెం చెరువు సమీపంలో ఇళ్ల వద్దకు మంచినీరు సరఫరా అయ్యే పైపులైను దెబ్బతిందని స్థానికులు చెప్పిన సమస్యను సంబంధిత పంచాయతీ అధికారుల వద్ద ప్రస్తావించగా స్పందించి చర్యలు చేపట్టారు. సర్పంచి మద్దాల బాబూరావు, కార్యదర్శి డి.సురేష్ అక్కడ పైపునకు మరమ్మతులు చేయించడంతో తాగునీటి సమస్యకు పరిష్కారం చేకూరింది.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

ఆపదలో.. ప్రాణదాతలు

36 సార్లు రక్తదానం... 12 శిబిరాలు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: మండలంలోని చాకలిపాలెంలోని చిరుపవన్ సేవాసమితి అధ్యక్షుడు, యువకుడు కందాల చంటి 2006 నుంచి ఇప్పటి వరకు 36సార్లు రక్తదానం చేశారు. చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని 12 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. సుమారు 550 మంది దాతలు పాల్గొని తమ వంతు సేవా భావంతో రక్తదానం చేసేలా ప్రోత్సహించారు. తన మిత్రబృందంలో సుమారు 25 మంది సభ్యులు ఉన్నారు. నేటికీ ఎవరికైనా అత్యవసర సమయంలో రక్తం అవసరమైతే తోడ్పాటు అందిస్తున్నారు.


రక్తదానం చేస్తున్న కందాల చంటి

నా గ్రూపు బి పాజిటివ్

నా రక్తం గ్రూపు బి పాజిటివ్. 2007 నుంచి ఇప్పటి వరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎక్కడ రక్తదాన శిబిరాలు పెట్టినా వెళ్లాను. మా స్నేహితులందరం కలిసి పవన్‌కల్యాణ్, చిరంజీవి పుట్టిన రోజున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి అక్కడ రక్తం ఇస్తాం. ఇబ్బందిలో ఉన్న వారు ఫోన్ చేసినా నేను రక్తం ఇస్తుంటా. ఆరోగ్యంగా ఉండవచ్చు. ఇప్పటి వరకు నేను 44 సార్లు రక్తదానం చేశా. **- నామన నాగభూషణం, సఖినేటిపల్లి**



సమాచారం ఇస్తే వాలిపోతారు



అంబాజీపేట: ఈ చిత్రంలో రక్తం ఇస్తున్న యువకులు నల్లా సుధాకర్ (నీలం రంగు ప్యాంటు), కట్టా దుర్గారావు. ఇప్పటి వరకు ఒక్కొక్కరు 40 సార్లు రక్తదానం చేశారు. అంబాజీపేట మండలంలోని చిరుతపూడికి చెందిన యోగాగురువు ఆకుల శ్రీనివాస్ పిలుపుతో ఈ యువకులు ఎవరైనా రక్తం కావాలని అడిగితే క్షణం ఆలోచించకుండా ముందుకు వస్తుంటారు. కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన నల్లా సుధాకర్ 42 సార్లు, ఆదే మండలంలోని రాకుర్తివారిపాలేనికి చెందిన కట్టా దుర్గారావు 40 సార్లు రక్తదానం చేశారు.

ప్రాణాలు నిలిచాయన్న సంతృప్తి

మలికిపురం: రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న అభాగ్యుల ప్రాణాలు నిలపాలన్న లక్ష్యంతో చిరంజీవి ప్రారంభించిన రక్తదాన కార్యక్రమాలను ఇక్కడి మలికిపురం, సఖినేటిపల్లి మండలాల చిరు, పవన్, చరణ్ సేవా సమితి కొనసాగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. సమితి గౌరవాధ్యక్షుడు రావి మురళి, అధ్యక్షుడు ముదిగొండ బుజ్జి ఆధ్వర్యంలో ఎనిమిది సంవత్సరాలుగా బ్లడ్‌బ్యాంకుకు స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం 100 నుంచి 150 యూనిట్లు పైగా అన్ని రకాల రక్తగ్రూపులకు సంబంధించి రక్తాన్ని ఆ బ్లడ్ బ్యాంకులో డిపాజిట్లు చేసి మళ్లీ ఎవరికైనా రక్తం అవసరమైతే సరఫరా చేస్తున్నట్లు సభ్యులు చెప్పారు.


సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం

ఏ సమయంలోనైనా స్పందిస్తాం

మామిడికుదురు: కోనసీమ బ్లడ్ బ్యాంకు స్వచ్ఛంద సేవా సంఘంలోని సభ్యులంతా ఏ సమయంలోనైనా రక్తదానం చేసేందుకు సిద్ధంగా ఉంటారు. ప్రతి సభ్యుడు ఎంతో సేవా దృక్పథంతో స్పందిస్తారు. మా సంఘంలో దాదాపు 25 సార్లు పైగా రక్తదానం చేసిన సభ్యులున్నారు. రక్తదానంపై ఉన్న అపోహలను పోగొట్టేలా సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం **- కాండ్రేగుల నరేంద్ర, సంఘ అధ్యక్షుడు**



చాలా సంతోషంగా ఉంది

సఖినేటిపల్లి: నేను లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో ఎన్ఆర్ఎంగా పని చేస్తున్నా. ఎవరైనా ఆపదలో ఉండి రక్తం కావాలని ఫోన్ చేస్తే వెంటనే వెళ్లి రక్తం ఇస్తా. నా రక్తం గ్రూపు బి పాజిటివ్. ఇప్పటి వరకు భీమవరం, పాలకొల్లు, అమలాపురం, కాకినాడలో 12సార్లు ఇచ్చాను. రక్తం ఇవ్వడం వల్ల ఇబ్బంది ఉండదు. ప్రమాదంలో ఉన్నవారికి నా రక్తం ఇవ్వడం నాకు చాలా సంతోషంగా ఉంది. **- చింతా పాపారావు, అంతర్వేదిపల్లిపాలెం**



32 సార్లు రక్తం ఇచ్చాను

రాజోలు: ఆపదలో ఉన్న వారికి నేను ఇప్పటి వరకు 32 సార్లు రక్తదానం చేశా. చిరంజీవి, రామ్‌చరణ్‌ల పుట్టినరోజున శిబిరాలను ఏర్పాటుచేసి రక్తాన్ని సేకరించి ప్రభుత్వ ఆసుపత్రిలో నిల్వచేస్తున్నాం. దూర ప్రాంతాల్లో ఎవరికైనా రక్తం అవసరమైతే తప్పనిసరిగా దాతలను పంపించి వారి అత్యవసరాన్ని తీరుస్తుంటా. **- కోళ్ల బాబి, రాజోలు**



లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారు


మంత్రి లోకేశ్‌కి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు, ఆకుల రామకృష్ణ

కొత్తపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పలు సమస్యల పరిష్కారానికై విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, రైతు అధ్యక్షుడు ఆకుల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

మద్యం షాపులు తరలించాలి

ఆలమూరు, న్యూస్‌టుడే: కొత్తఊరు సెంటర్‌లో జాతీయ రహదారిపై ఉన్న మద్యం షాపులు రెండింటిని జనావాసాలకు, దుకాణాలకు దూరంగా తరలించాలని కోరుతూ పెదపళ్ళకు చెందిన నాయకులు నామాల రుద్రయ్య చౌదరి, నెక్కంటి ప్రకాష్‌లు సోమవారం సమస్యల పరిష్కారవేదికలో ఫిర్యాదు చేశారు. మద్యం షాపులు రహదారి పక్కనే ఉండటం వలన ఆ మార్గం మీదుగా వెళ్ళే విద్యార్థులకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని తెలిపారు.


నగరంలో మొక్క నాటుతున్న పి.గన్నవరం ఎమ్మెల్యే సత్యనారాయణ తదితరులు


సోంపల్లిలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ


ఆత్రేయపురం: వాడపల్లి దేవస్థానం ఉద్యోగులు..

పచ్చదనం పరిఢవిల్లేలా తీర్చిదిద్దాలి

మామిడికుదురు, న్యూస్‌టుడే: చమురు, సహజవాయు క్షేత్రాలను పచ్చదనంతో పరిఢవిల్లేలా తీర్చిదిద్దాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఓఎన్జీసీ గ్యాస్ కలెక్టింగ్ స్టేషన్ ఆవరణలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. లూటుకుర్రు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోనూ మొక్కలను నాటి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎస్ఎంసీ ఛైర్మన్ బోనం సత్యరాజు తెచ్చిన మొక్కలను ఎమ్మెల్యే చేతుల మీదుగా 300 మంది విద్యార్థులకు అందజేశారు. జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, సర్పంచులు జాలెం రమణకుమారి, అడబాల తాతకాపు, జడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, ఓఎన్జీసీ ఏరియా మేనేజర్ కేజేఎం రావు, ఇన్‌స్టలేషన్ మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ 1, 2 ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోంపల్లిలో పరిసరాలను శుభ్రం చేశారు. మురుగు కాలువ, మంచినీటి ట్యాంకుల శుభ్రత, ప్లాస్టిక్ నిషేధం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ పి.సాయిబాబు, సర్పంచి కట్టా శ్రీనివాసరావు, నల్లి రాజు, సరిత, శైలజ, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం వాడపల్లి దేవస్థానం పార్కింగ్ తదితర ప్రాంతాల్లో దేవాదాయ శాఖ ఉద్యోగులు శుభ్రం చేశారు. కార్యక్రమాన్ని దేవస్థాన డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధరరావు పర్యవేక్షించారు.


వెంకటలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ఎంఈవో, గ్రామస్థులు

ఉపాధ్యాయురాలికి సత్కారం

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న భారం వెంకటలక్ష్మి, ప్రసాద్ దంపతులను డిఈవో కమలకుమారి, ఎంఈవో హరిప్రసాద్, మాజీ సర్పంచ్ చింతం విజయకృష్ణ మోహన్ సోమవారం ఘనంగా సత్కరించారు. ఎంఈవో మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను భారతదేశ పౌరులుగా తీర్చిదిద్ది ఉన్నత స్థానాల్లో నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎక్సైజ్ సీఐలు


కె.కాత్యాయని

కొత్తపేట: కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ సీఐగా కె.కాత్యాయని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డి.సురేఖ బదిలీల్లో భాగంగా గన్నవరం వెళ్ళగా కాత్యాయని ఆకివీడు నుంచి ఇక్కడకు వచ్చారు.


నాగేశ్వరరావు

ఆలమూరు: ఆలమూరు ఎక్సైజ్ సీఐగా ఐడి నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎదురులంక చెక్‌పోస్టు నుంచి ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన సత్యవేణి విజయవాడకు బదిలీ అయ్యారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ నాటుసారా, ఇతర మాదక ద్రవ్యాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి అదుపులో ఉంచుతానన్నారు.



రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు ఎక్సైజ్ సీఐగా కె.వీరబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పోలవరం నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన పి.శ్రీనివాస్ రామచంద్రపురం బదిలీ అయ్యారు.

రావులపాలెం విద్యుత్తు శాఖ ఏఈగా నరేష్

రావులపాలెం పట్టణం: రావులపాలెం విద్యుత్తు శాఖ ఏఈగా నరేష్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సుధాకర్ రాజానగరం బదిలీపై వెళ్లారని ఉన్నతాధికారులు ఈయనను నియమించారు.

ఆలమూరు సబ్ స్టేషన్ జేఈగా దుర్గాప్రసాద్

ఆలమూరు: ఆలమూరు సబ్‌స్టేషన్ జేఈగా డీఎంకే దుర్గాప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా బిక్కవోలు నుంచి ఇక్కడకు వచ్చారు. రెండేళ్లుగా ఇన్‌ఛార్జిగా వై లక్ష్మి నిర్వర్తించారు.

మందపల్లి ఆలయ ఇన్‌ఛార్జి ఏసీగా సత్యనారాయణరాజు



కొత్తపేట: కొత్తపేట మండలం మందపల్లి మందేశ్వరస్వామి దేవస్థానానికి ఇన్‌ఛార్జి సహాయ కమిషనర్‌గా ముదునూరి సత్యానారాయణరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన విజయలక్ష్మి పెద్దాపురం మరిడమ్మ దేవాలయానికి బదిలీ అయ్యారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రావులపాలెం పట్టణం, కొత్తపేట: రావులపాలెం సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆశాఖ ఈఈ రవికుమార్ అన్నారు. కొత్తకాలనీ, వెదిరేశ్వరం రోడ్డు, రావులపాడు, కె.ఎస్.ఆర్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 1 గంట వరకు, కొత్తపేట గ్రామంలోని కమ్మిరెడ్డిపాలెం, హైస్కూల్ సెంటర్, తాళ్ళమ్మగుడి వద్ద, కోర్టు ఏరియా, వాడపాలెం ప్రాంతాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామన్నారు.

కారు డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని మృతిచెందిన ఘటన రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అప్పారావు వివరాల మేరకు.. నగరంలోని చౌడేశ్వరినగర్‌కు చెందిన వంకా వెంకట్రాజు(37) ఓఎన్జీసీలో తాత్కాలిక ప్రాతిపదికన కారు డ్రైవరుగా పనిచేస్తుంటాడు. ఇతనికి 2014లో ఆలమూరు మండలం చింతలూరు గ్రామానికి చెందిన ఎం.భవానీతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. 2022లో విభేదాల కారణంగా పిల్లలను తీసుకుని భార్య పుట్టింటికి వెళ్లిపోయారు. దీంతో వెంకట్రాజు తల్లి అచ్యుతమ్మ వద్ద ఉంటున్నాడు. సోమవారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని వేలాడుతుండడం గమనించిన తల్లి స్థానికుల సాయంతో దించి, ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అప్పటికే అతడు మృతిచెందాడని సీఐ తెలిపారు.

తిరుపతి లడ్డూ కల్తీ దోషులను శిక్షించాలి

అంబాజీపేట, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూను కల్తీ చేసిన దోషులను శిక్షించాలని విశ్వహిందూ పరిషత్తు సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక రావులమ్మతల్లి ఆలయం వద్ద సోమవారం వీరు ఆందోళన చేశారు. విశ్వహిందూ పరిషత్తు మండల బాధ్యుడు కడలి వెంకటేశ్వరరావు, చిక్కం ఏసు, తిరుమనాధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మామిడికుదురు: తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీకి సంబంధించి సమగ్రంగా విచారణ చేసి కారకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రాజోలు పూర్వపు తాలూకాలోని పలువురు దివ్యాంగులు అప్పనపల్లి బాలబాలాజీస్వామివారి ఆలయ ప్రాంగణంలో సోమవారం దీక్ష చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా దీనిని నిర్వహించారు. జనసేన నాయకులు జాలెం శ్రీనివాసరాజా, అడబాల తాతకాపు, కంకిపాటి నరసింహారావు, తుండూరి బుజ్జి తదితరులు వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

అయినవిల్లి: సనాతన హిందూ ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలంటూ సోమవారం రాత్రి మండలంలోని విలస గ్రామంలో పలువురు భక్తులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి వేంకటేశ్వరస్వామివారి లడ్డూ ప్రసాదం అపవిత్రం చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.


విలస గ్రామంలో ర్యాలీ చేస్తున్న భక్తులు

వెంకట్‌కు సన్మానం

అంబాజీపేట: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అనకాపల్లిలో జరిగిన 139వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో అంబాజీపేటకు చెందిన సామాజిక సహజ కవి పోలమూరి వెంకట్‌ను వేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో సన్మానించారు.

మాలమహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక



అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట మండల మాలమహానాడు నూతన కార్యవర్గాన్ని స్థానిక జయంతినగర్ సమీపంలోని వ్యవసాయక్షేత్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షకార్యదర్శులుగా నాగవరపు నాగరాజు, నాగాబత్తుల సుధాకర్, ఉపాధ్యక్షుడిగా నెల్లి వెంకటరమణ, జాయింట్ సెక్రటరీగా బీర సురేష్, కోశాధికారిగా కోట హనుమంతరావు, సభ్యుడిగా గోసంగి కుమారస్వామిలను ఎన్నుకున్నారు. సమావేశంలో సర్పంచి జల్లి బాలరాజు, ఎంపీటీసీ సభ్యులు ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ముగ్గురి ఎంపిక

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అండర్-19 క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ జె.శాంతకుమారి సోమవారం తెలిపారు. మౌనిక(యోగా), త్రిపురయజ్ఞేశ్వరి(విలువిద్య), జె.దర్మ(బాక్సింగ్) విజయం సాధించారన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.సాయిబాబు, విశ్రాంత ఎంఈవో గోపాలకృష్ణ, విద్యార్థులను అభినందించారు.

బాలికకు ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: మూలగొందిలో విద్యుత్తు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న బర్రె దుర్గా భవానికి గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హేండ్స్ సభ్యులు సేకరించిన రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని వసుధ ఫౌండేషన్ కన్వీనర్, మాజీ సర్పంచి జంపన బుజ్జిరాజు బాలిక కుటుంబానికి అందజేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొక్కిరిగెడ్డ శ్రీనివాసు రూ.5000 అందించారు. ఈకార్యక్రమంలో సర్పంచి రవికుమార్, నల్లిప్రసాదరావు, తిరుమాని రామకృష్ణ, కారాడి నరసింహస్వామి పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ఉపయోగపడేలా చర్యలు


పథకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: మండలంలోని చింతలమోరి-శంకరగుప్తం ఎత్తిపోతల పథకాన్ని మరింత మెరుగ్గా రైతులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పథకంలో రెండు మోటార్లు పని చేయడం లేదని, ఒక్క మోటారుతోనే పథకాన్ని అంతంత మాత్రంగా వినియోగించుకుంటున్నట్లు రైతులు ఎమ్మెల్యేకి చెప్పారు. లిఫ్ట్ ఇరిగేషను డీఈఈ పి.దుర్గాగురవయ్య, ఏఈలు బి.ప్రసాద్, ఎ.సురేంద్ర, సర్పంచి రాపాక ఆనందకుమార్, ఎంపీటీసీ సభ్యులు ఆచంట మాణిక్యం, మానుకొండ ప్రమీల, కార్యదర్శి డి.ఎల్.సునీత పాల్గొన్నారు.

★ నియోజకవర్గంలో తాగు నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చెప్పారు. జి.పల్లిపాలెంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును సోమవారం ఆయన ప్రారంభించారు. పెచ్చెట్టి నరసింహస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టరు పెద్దకాపు, ఎంపీపీ వెంకట సత్యవాణి, ఉప ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ నరసింహస్వామి పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాలపై అవగాహన సదస్సు

రాజోలు: పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోంపల్లి గ్రామపంచాయతీ వద్ద సోమవారం అట్రాసిటీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచి కట్టా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాజోలు ఎంపీడీవో బాలాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎస్సీ, ఎస్టీ చట్టాల గురించి ప్రజలకు వివరించారు. పొలమూరి శ్యాంబాబు, బత్తుల మురళీకృష్ణ, ఈవోపీఆర్డీ భీమారావు, తరుణ్‌రాజ్, గణపతిరావు, సాయిబాబు,ఆదినారాయణ పాల్గొన్నారు.

సమాజ సేవకు తోడ్పడాలి

ఆత్రేయపురం: బ్రాహ్మణులంతా ఐకమత్యంగా ఉంటూ సమాజ సేవకు తోడ్పడాలని మండల గాయిత్రీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శిష్టా సూర్యకుటుంబరావు అన్నారు. మాసశివరాత్రి సందర్భంగా పేరవరం గ్రామంలోని శివాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు జరిపారు. సభ్యులు కాట్రాలపల్లి సూర్యనారాయణ, రవిశంకర్ పాల్గొన్నారు.

ఎవరి ప్రయత్నం వారిది

వ్యవసాయ మార్కెట్ కమిటీ పీఠం వరించేదెవరికో..!

అంబాజీపేట, న్యూస్‌టుడే



అంబాజీపేట మార్కెట్ కమిటీ కార్యాలయం

పి.గన్నవరం నియోజకవర్గంలో అంబాజీపేట, నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. మొన్న రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులను కేటాయించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల పంపకానికి శ్రీకారం చుట్టింది. దీంతో ఆయా మార్కెట్ కమిటీల పరిధిలో ఛైర్మన్‌తో పాటు వైస్‌ఛైర్మన్, డైరెక్టర్లు (సభ్యులు) పదవులను ఆశించే ద్వితీయశ్రేణి నాయకులు తమనే పదవి వరిస్తుందనే ఆశలో ఉన్నారు. అంబాజీపేట మార్కెట్ పరిధిలో ఉన్న అంబాజీపేట, అయినవిల్లి మండలాలకు చెందిన పదుల సంఖ్యలో నాయకులు ఈ కమిటీ ఛైర్మన్ పదవిని కోరుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగానే ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముందు ఈ విషయాన్ని ఉంచారు. దీనితో పాటు అధినాయకుల అనుగ్రహం కూడా పొందే ప్రయత్నం చేస్తున్నారు. నగరం మార్కెట్ కమిటీ పరిధిలోకి వచ్చే పి.గన్నవరం, మామిడికుదురు మండలాల నుంచి కూడా ఛైర్మన్ పదవిని ఆశించే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ ఛైర్మన్ పదవుల ఎంపిక ఇప్పుడు ఎమ్మెల్యేకు కత్తిమీద సాములా మారింది. ఎందుకంటే అటు తెదేపా, ఇటు జనసేన, భాజపా పార్టీల శ్రేణులను తృప్తిపరచాలి. ఓ పార్టీవారికి కేటాయిస్తే... మరో పార్టీవారి నుంచి వ్యతిరేకత వ్యక్తమౌతుంది. అలాగే కూటమి పార్టీలో సీనియర్ నాయకులతో పాటు జూనియర్ నాయకుల్ని ప్రోత్సహించాల్సి ఉంటుంది. జనసేన అధికారంలో లేనప్పుడు పార్టీజెండాను భుజాన వేసుకున్న తమకు ఛైర్మన్ పదవి కేటాయించాలని ఆ పార్టీనాయకులు కొందరు కోరుతున్నారు. అలాగే తెదేపాలో కష్టపడిన వారికే ఛైర్మన్ పదవి ఇవ్వాలని వారంటున్నారు. తమకు కూడా న్యాయం చేయాలని భాజపా శ్రేణులు కోరుతున్నాయి. దీనితో పాటు సామాజికవర్గాలను బేరీజు వేసుకుంటే తమ సామాజిక వర్గానికే ఛైర్మన్ పదవి ఇవ్వాలని కొందరు సామాజికవర్గనేతలు అంటున్నారు. అంబాజీపేట, నగరం ఛైర్మన్‌లల్లో సామాజికవర్గ సమీకరణలు చేసి ఛైర్మన్ పదవి తమకే కావాలని ఓ సామాజిజికవర్గం నాయకులు కోరుతున్నారు. అంబాజీపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవికి 10 మంది, నగరం ఛైర్మన్ పదవికి ఆ రెండు మండలాల నుంచి 5 మంది కూటమినాయకులు ఆశిస్తున్నారని నామినేటెడ్ పదవుల ప్రచారం జరుగుతోంది.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

స్వర్ణోత్సవాలకు సిద్ధం


మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఉప్పలగుప్తం: కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ స్వర్ణోత్సవ వేడుకలను డిసెంబరులో ఘనంగా నిర్వహించడానికి సభ్యులు సిద్ధంగా ఉండాలని సంఘ అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తెలిపారు. సోమవారం బండారులంకలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ప్రతిభచాటిన 53 మంది దేవాంగ విద్యార్థినీవిద్యార్థులకు రూ.1.25 లక్షల ఉపకార వేతనాలు అందించారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయినులుగా ఎంపికైన భ్రమరాంబికాదేవి, ప్రమీలాదేవి, విజయలక్ష్మిలను సన్మానించారు.

ఘనంగా లక్షపత్రి పూజ

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజ సోమవారం ఘనంగా జరిగింది. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కుండలేశ్వరుడికి అలంకరణ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: పార్వతీసమేత కుండలేశ్వరాలయంలో అర్చకులు కామేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విజేతలకు సన్మానం


అభినందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

అమలాపురం పట్టణం: రాజమహేంద్రవరంలో న్యాయవాదుల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో అమలాపురం న్యాయవాదులు గుత్తుల విజయశ్రీ, కె.విజయలక్ష్మి విజయం సాధించారు. అమలాపురంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజేతలకు అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నందిత శ్రీనివాస్, అడపా ప్రసాద్, నాగేశ్వరరావు, డి.మూర్తి, నంబూరి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయక సేవలే గుర్తుంటాయి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఉద్యోగ జీవితంలో అందిచే స్ఫూర్తిదాయక సేవలు.. తగిన గుర్తింపునివ్వడంతోపాటు కలకాలం నిలుస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన వి.విజయలక్ష్మికి కార్యాలయం వద్ద ఏడీ సురేష్ అధ్యక్షతన సోమవారం సన్మాన కార్యక్రమంలో డీఈవో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బి.రామనాథం, సూర్యప్రకాశరావు, నరసింహఫణి, ప్రవీణ్ కుమార్, శ్రీనివాసరావు, భాను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న అధికారులు

అమలాపురం పట్టణం: విధి నిర్వహణలో భాగంగా అందించిన సేవలు గుర్తింపునిస్తాయని ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. అమలాపురంలో ట్రాఫిక్ ఎస్సై పీఎస్‌వీఎస్ రాజు, కమ్యూనికేషన్స్ ఎస్సై దుర్గాప్రసాదరావులను కార్యాలయ అధికారులు, సిబ్బందితో కలిసి సన్మానించారు. ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ విజయసారథి తదితరులు పాల్గొన్నారు.


రాజును సత్కరిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీలు

ప్రతిభావంతులకు బహుమతులు

యానాం: యానాం పరిధిలో గత విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 'ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్(బ్యాంకు)' ద్వారా సోమవారం ప్రతిభా అవార్డులు అందజేశారు. ఇంటర్మీడియట్‌లో తన్మయ, శ్రీశ్రేయ, పదో తరగతిలో పావనిసత్యసాయిశ్రీ, నాగఅక్షయ అంజనలకు యానాం విశ్రాంత పరిపాలనాధికారి అప్పారావు చేతులమీదుగా అవార్డులు అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు, ప్రశంసాపత్రం అందజేశారు. మేనేజరు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఆవేదన విని.. ఆదుకోమని..

మేమంతా గ్రామాల్లో చిన్నపాటి సమస్యలతో ఇబ్బందిపడుతున్నాం. మండల అధికారులు పట్టించుకోవడం లేదని, కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి వేడుకున్నారు. – న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి



మేము గోడి బాలుర గురుకుల పాఠశాల ఎస్ఎంసీ కమిటీ సభ్యులం. పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థపడుతున్నారు. రెగ్యులర్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు లేరు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు తరగతి గదులులేక, ఉన్న వాటిలోనే నెట్టుకొస్తున్నారు. - విద్యార్థుల తల్లిదండ్రులు

మా ఉపాధికి గండి కొడుతున్నారు.. - ట్యాక్సీ డ్రైవర్లు



మేమంతా వాహనాలు అద్దెకు తిప్పుకొంటూ జీవనం సాగిస్తున్నాం. ట్యాక్సీ బోర్డులు(పసుపు రంగు నంబరు ప్లేట్లు) వేసుకుని కిరాయిలకు తిప్పుతున్నాం. మూడు నెలలకోసారి రూ.వేలల్లో ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నాం. కొంత మంది సొంత కార్లున్నవారు ఏ విధమైన పన్నులు చెల్లించకుండా తక్కువ అద్దెలకు వాహనాలు తిప్పుతున్నారు. దీంతో మేము ఉపాధి కోల్పోతున్నాం. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయాలి.

ఉద్యోగ భద్రత కల్పించండి



మేము గ్రామాల్లోని ఉప ఆరోగ్యకేంద్రాల్లో 15 ఏళ్లుగా రెండో ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్నాం. గత ప్రభుత్వం మాకేమీ చేయలేదు. కూటమి ప్రభుత్వం దయచూపి, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. - ఏఎన్ఎంలు

విద్యుత్తు సమస్యతో యాతన.. - ఆక్వా రైతులు



మేమంతా బెండమూర్లంక ఆక్వా రైతులం. మా గ్రామంలోని విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో పలు గ్రామాలకు చెందిన ఆక్వా విద్యుత్తు కనెక్షన్లు ఉండటంలో లోఓల్టేజీ సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. ఏరియేటర్లు, గృహాల వద్ద నీటి మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం. పంచాయతీ కొబ్బరి చెట్లకు వేలం లేకుండా కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరించి గతంలోనివారికే తక్కువ కౌలుకివ్వడంపై చర్యలు తీసుకోండి.

సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు..



మాది అల్లవరం. మా అమ్మకు ఆరోగ్యం బాగోలేదని ఇటీవల అల్లవరం సీహెచ్‌సీకి తీసుకువెళ్లాం. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది ఈసీజీ తీయాలని చెప్పి తప్పుడు పద్ధతిలో తీశారు. అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చూపిస్తే సమస్య ఏమీ లేదన్నారు. సీహెచ్‌సీలో రోగులను పట్టించుకోకుండా స్మార్ట్‌ఫోన్లు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలి. - నార్ని వెంకటరమణ

సభ్యత్వాలు నమోదు చేయించండి

కాట్రేనికోన: నాయకులు ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో వందమంది సభ్యులను చేర్పించాలని జిల్లా భాజపా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు కోరారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గొలకోటి దొరబాబు అధ్యక్షతన సోమవారం కాట్రేనికోనలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పార్టీ సభ్యత్వాలపై చర్చించారు. నానాజీ, వెంకట సుబ్బారావు, వెంకటేశ్వరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

గణిత సూత్రాలపై పట్టుతో మేలు


మాట్లాడుతున్న పాపారావు

ముమ్మిడివరం: విద్యార్థులు గణిత శాస్త్రంలో సూత్రాలపై పట్టు సాధించడం ద్వారా పాఠ్యాంశ సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చని కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిసోర్స్‌పర్సన్ డా.డీసీహెచ్ పాపారావు సూచించారు. ముమ్మిడివరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డా.ఎస్.ప్రభాకర్ అధ్యక్షతన గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అప్లికేషన్స్ ఆఫ్ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ ఇన్ వేరియస్ ఫీల్డ్స్' అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సులో పాపారావు మాట్లాడారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు వివరించారు. కె..చిట్టిబాబు, డా.ఎన్.తులసిలక్ష్మి, డా.జి.సుజాత పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా


ఉపాధ్యాయులతో విజేతలు

ఉప్పలగుప్తం: కాకినాడలో జరిగిన ఉమ్మడి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం మండలం ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు కడిమి నాని, జల్లి జితేంద్ర విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన ఎస్.జి.ఎఫ్. అండర్-17, 19 విభాగాల్లో రజత, కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం వి.శ్రీనివాసరావు, పీఈటీ వి.నరసింహారావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ రాజా, సర్పంచి శివాలిని, రమేష్, అప్పాజీ, ఉపాధ్యాయులు తదితరులు సోమవారం అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్‌కు..


బి.లావణ్య


ఉప్పలగుప్తం: విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మునిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని బి.లావణ్య ఎంపికైందని హెచ్ఎం ఏడుకొండలు తెలిపారు. సోమవారం కాకినాడలో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ వై.కిరణ్, సర్పంచి వై.రామచంద్రరావు, పీడీ సీతాపతి, ప్రసాద్ తదితరులు అభినందించారు.


ముంపులో నగర పంచాయతీ వీధి

వర్షం.. లోతట్టు జలమయం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 వరకు రెండు గంటలపాటు ఎండతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ముమ్మిడివరంలోని బళ్లగేటు సెంటర్, కుమ్మర్లవీధి, ఆసుపత్రి వీధి, కొండాలమ్మచింత, మార్కెట్ ప్రాంతాల్లోని రహదారులు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది.

చిత్రకళా పోటీల్లో ప్రశంస


నరసింహ గీసిన చిత్రం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: పల్లె సంప్రదాయాలపై జాతీయ స్థాయిలో క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ సంస్థ నిర్వహించిన చిత్రకళా పోటీల్లో అమలాపురం మండలం పాలగుమ్మి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్ర కుమార్ పలువురి ప్రశంసలు అందుకున్నారు. కాకినాడ న్యూసెంచరీ స్కూల్లో ఆదివారం జరిగిన చిత్రకళా ప్రదర్శనలో సంస్థ అధినేత అకొండి అంజి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇదే పాఠశాలకు చెందిన డి.రీనాఅలేఖ్య మరో అవార్డు అందుకోవడం విశేషం. ఇరువురినీ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సోమవారం అభినందించారు.

కిశోర బాలికల ఆరోగ్యానికి పోషకాహారం

అల్లవరం: కిశోర బాలికల్లో రక్త హీనతను నివారించి వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించేందుకే పోషకాహార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. సోమవారం గోడి బాలికల గురుకుల పాఠశాలల్లో పౌష్టికారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ కిరణ్మయి, జి.వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ప్రథమం

యానాం: యానాంలో నిర్వహించిన అండర్-17 బాలికల వాలీబాల్ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో డా.కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూలు ప్రథమ స్థానంలో నిలవగా ఎస్టీపీపీ జూనియర్ కళాశాల ద్వితీయ, గిరియాంపేట జీహెచ్ఎస్ తృతీయ స్థానంలో నిలిచాయి. పీవీఎస్ ప్రకాష్, పాము సత్యనారాయణ, భాస్కర్, మోహన్, చంద్రశేఖర్, సన్యాసిరావు పాల్గొన్నారు.


అండర్-17 విజేత జట్టు

రక్షణ చర్యలు చేపట్టాలని ఫిర్యాదు

అల్లవరం: గోడిలో ఆంజనేయస్వామి గుడి సమీపంలో ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయని, రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రుద్రరాజు లక్ష్మీపతిరాజు, శెట్టిబత్తుల తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ఉప్పలగుప్తం: బండారులంక కందులపాడుకాలనీ చెందిన చింతా త్రిమూర్తులు కనిపించడం లేదని తాలూకా ఎస్సై శేఖర్‌బాబు సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కూరగాయల వ్యాపారం సక్రమంగా జరగట్లేదని, మానేస్తానని ఈ నెల 27న త్రిమూర్తులు భార్యతో అన్నాడు. ఆ విషయంపై ఇద్దరి మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. మరునాడు ఉదయం చూసేసరికి భర్త కనిపించలేదు. భార్య సూర్యవతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమవారం తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

సమస్య: అమలాపురంలోని కాలేజీరోడ్డులో ప్రధాన రహదారి పక్కన ఖాళీస్థలంలో చుట్టుపక్కల ప్రాంతాలవారు చెత్తను పడేస్తున్నారు. చెత్తను ఆవులు చిందరవందర చేయడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. – సీహెచ్.ప్రశాంత్, వ్యాపారి

సమస్య: అమలాపురంలోని రాతిబడి కాలువపై పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. మురుగు ముందుకు కదలక దోమలు పెరిగిపోయాయి. – మామిడిపల్లి రాంబాబు, స్థానికుడు

సమస్య: అమలాపురంలోని యర్రమిల్లివారివీధి రోడ్డులో మట్టి, వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారైంది. – రాజా, స్థానికుడు

పరిష్కారం: స్థానిక కాలేజీరోడ్డు, రాతిబడి, యర్రమిల్లివారివీధి సమస్యలు తెలుపగా ఆయా వార్డుల సచివాలయ కార్యదర్శులు స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

సమస్య: కాట్రేనికోన పంచాయతీ పరిధి కొత్తపాలెంలో కొన్నిచోట్ల వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలి. – రాము, స్థానికుడు

పరిష్కారం: సమస్యను సర్పంచి సుధాకర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో దీపాలకు మరమ్మతులు చేయించారు.

సమస్య: పల్లంకుర్రు పరిధిలో తాగునీటి ట్యాంకులో నాచు ఏర్పడింది. పంచాయతీ అధికారులు శుభ్రంచేసే పనులు చేపట్టాలి. – గ్రామస్థులు

పరిష్కారం: సమస్యను సర్పంచి అలివేణి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: **79811 19595**, ముమ్మిడివరం: **80085 74166**

మున్సిపల్ అధికారులపై చర్యలకు డిమాండ్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అమలాపురం పురపాలిక పరిధిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహించాలని జనసేన, తెదేపా కౌన్సిలర్లు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో తిరస్కరిస్తున్న అక్రమ పనులకు ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఆమోదం తెలిపి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. వాయిదా వేసిన తీర్మానాలను, సమావేశం ముగిసిన తరువాత మార్చి రాస్తున్నారన్నారు. వైకాపా కౌన్సిలర్లకు, కొందరు అధికారులుతోడై పురపాలికకు చెందిన రూ.కోట్లను అందినకాడికి దోచుకుంటున్నారన్నారు. ప్రతి దానికీ నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో దొడ్డిదారిలో సొమ్ములు చెల్లించి, తలోకొంత పంచుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఏడిద శ్రీను, గండి దేవీహారిక, పడాల శ్రీదేవి, బొర్రా వెంకటేశ్వరరావు, అబ్బిరెడ్డి చంటి, పిండి అమరావతి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ఆందోళనలో పురపాలిక కౌన్సిలర్లు

నగదు ప్రోత్సాహకం

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి రాష్ట్ర పోలీసు విభాగంలో పని చేస్తున్న వారి పిల్లలు విద్యలో ప్రతిభచాటితే అందించే అవార్డును ఆ రాష్ట్ర డీజీపీ షాలినిసింగ్ సోమవారం పలువురికి ఇచ్చారు. యానాంకు చెందిన నందిక జెస్సికా ఇంటర్మీడియట్‌లో 985 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. జెస్సికా తండ్రి నందిక కృపావరం ఏఎస్సైగా పనిచేస్తున్నారు. పుదుచ్చేరి రీజియన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జెస్సికాకు రూ.25 వేల నగదు బహుమతిని డీజీపీ అందజేశారు.


ప్రోత్సాహకం అందిస్తున్న డీజీపీ షాలినిసింగ్

జనసేన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు


జనసేన నాయకుల దీక్షలో ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఉప్పలగుప్తం: తిరుమలలో జరిగిన అపచారానికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా భీమనపల్లిలో కూటమి నాయకులు సోమవారం రాత్రి అనంగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు. ఎంపీటీసీ-1, 2 సభ్యురాళ్లు దేశంశెట్టి నాగరత్నకుమారి, శేషవేణి, నాయకులు గొలకోటి తాతాజీ, గుత్తుల నాగేశ్వరరావు, కంకటాల రామం, మంచెం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం పట్టణం: తిరుమల ప్రసాదం లడ్డూలో నెయ్యి అపవిత్రతపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. గడియారస్తంభం ప్రాంగణంలో జనసేన నాయకుల దీపారాధనలో ఎమ్మెల్యే సోమవారం పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద నల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు, వీరమహిళలు అఖండ దీపారాధన చేశారు. శ్రీను, శ్రీదేవి, అజేయ్, మానస, సుధ తదితరులు పాల్గొన్నారు. మహిపాలవీధిలో వినాయకుడి ఆలయం వద్ద యువజన సంఘ నాయకులు అఖండ దీపారాధన నిర్వహించారు. గాయకుడు చంద్రశేఖర్ తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీపై గానం చేశారు.


క్రాపచింతలపూడిలో..

ముమ్మిడివరం: శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో అపచారం జరిగిన సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా క్రాపచింతలపూడిలో జనసేన ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం నాయకులు దీపాలు వెలిగించారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి విగ్రహం ముందు దీపాలు వెలిగించారు.

అమలాపురం పట్టణం: తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిని కల్తీ అపవిత్రతపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా ఉంటామని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు తెలిపారు. అమలాపురంలోని గడియారస్తంభం ప్రాంగణంలో జనసేన పార్టీ నాయకులు మూడో రోజు రిలే నిరాహార దీక్ష సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా నాయకులు నిరసనకారులకు సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. చిక్కం భీముడు, గండి మణి, సుధా చిన్నా, పిండి రాజా, గొర్తి పవన్, మండేల తేజ తదితరులు పాల్గొన్నారు.


శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద వీర మహిళలు

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఉప్పలగుప్తం: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన అమలాపురం మండలం రెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమలాపురం పట్టణం నారాయణపేటకు చెందిన కట్టా శ్రీనివాసరావు(50) ఒప్పంద విద్యుత్తు పనులు చేస్తూ ఉంటాడు. ఈ నెల 29న రాత్రి రెడ్డిపల్లి గ్రామంలో ఆలయం వద్ద లైటింగ్ పనులు చేస్తుండగా పైనున్న 11 కేవీ విద్యుత్తు తీగ తగిలి కిందకు పడిపోయాడు. తలకు బలమైన గాయమైంది. స్థానికుల సాయంతో కిమ్స్ ఆసుపత్రిలో చేర్చగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా ఎస్సై శేఖర్‌బాబు సోమవారం తెలిపారు.

దాతలు ముందుకు రావాలి



ఏరియా ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రం

అమలాపురం పట్టణం, ముమ్మిడివరం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన అమలాపురంలోని ఏరియా ఆసుపత్రిలో రక్త నిధి కేంద్రం ఉంది. అత్యవసర సమయాల్లో రక్తం అందడం ఆలస్యమైతే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడే ఆస్కారం ఉంది. ముమ్మిడివరం, కొత్తపేట తదితర ప్రాంతాల వారికి రక్తం కావాల్సివస్తే ఇక్కడికి రావాల్సిందే. చుట్టుపక్కల ప్రాంతాల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి రక్తంకోసం ఇక్కడికే వస్తుంటారు. రోడ్డు ప్రమాదాలు, గర్భిణులకు, రక్తహీనత ఉన్నవారికి, బ్లడ్‌క్యాన్సర్, నిత్యం అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఇలా ఎందరికో రక్తం కావాల్సిఉంటుంది. ఎన్టీఆర్, యువరత్న సేవాసమితి, కోనసీమ బ్లడ్ డోనర్స్, బ్రైట్ స్టోన్స్, ఆజాద్ ఫౌండేషన్, శ్రీస్వామి వివేకానంద జిమ్ సభ్యులు, సినిమా హీరోల ఫ్యాన్స్ ఎప్పుడు ఎవరికి అత్యవసరమైనా రక్తం ఇవ్వడానికి ముందుకు వస్తారు. వివిధ కళాశాల విద్యార్థులు కూడా రక్తదానం చేస్తున్నారు. నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా మరిందరు ముందుకు రావాలని రక్తదాతలు కోరుతున్నారు.


రక్తం ఇస్తున్న ఆజాద్ ఫౌండేషన్ సభ్యుడు

ఆపదవేళ ముందుంటాం..

ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2007 నుంచి సుమారు 30 వేల మందికి రక్తదానం చేశాం. ప్లేట్‌లెట్లు సుమారు 5 వేల మందికి, వైట్‌ప్లసర్స్ 22 మందికి ఇచ్చాం. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ప్లేట్‌లెట్ల పరికరం ఉచితంగా అందించేలా కృషి చేస్తున్నాం. విదేశాల్లోనూ రక్తం అందించాం. యువకులు, దాతలు ముందుకొచ్చి రక్తమివ్వాలి.
– యల్లమిల్లి నాగకొండలరావు, సంఘ అధ్యక్షుడు



25 సార్లు రక్తదానం చేశా..

ముమ్మిడివరంలో స్నేహితులమంతా కలిసి స్నేహ ఫ్రెండ్స్ సర్కిల్ పేరుతో సంఘాన్ని ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ క్రమంలో ప్రధానంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చేవారిని సమీకరించి ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తున్నాం. నేను ఇంత వరకు 25 సార్లు రక్తదానం చేశా. రక్తదానం విషయంలో అంతా ముందుకురావాలి. – షేక్ బాబర్, ముమ్మిడివరం

సకాలంలో ఆదుకోవాలని..



నిత్యం రోడ్డు ప్రమాదాలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఎంతోమంది రక్తం అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే ఆలోచనతో ప్రజల్లో అవగాహన కల్పించాలని సంకల్పించా. రక్తదానంపై అపోహలను తొలగించడానికి నేనే రక్తదానం చేయడం ప్రారంభించా. ఇప్పటివరకు 22 సార్లు ఇచ్చా. ఈ విషయంలో ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలి.
– మట్టపర్తి నాగదుర్గాహరీశ్, మట్టాడిపాలెం

మండపేట

•మండపేట •రామచంద్రపురం

విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తాపేశ్వరం పోలిశెట్టి సత్తిరాజు, భూషణం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. జీఎస్‌ఎల్ ఆసుపత్రి ఛైర్మన్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపల్ గంటా సునీల్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ జె.టి.పవిత్ర, ప్రొఫెసర్ మాణిక్యకుమార్, రాజానగరం, రాజమహేంద్రవరం దంత వైద్య కళాశాల్లో వైద్య విభాగ సిబ్బంది సుమారు 500 మంది విద్యార్థులు, గ్రామస్థులకు దంతవైద్య పరీక్షలు చేశారు. పుప్పిన పళ్ల తొలగించారు. దంత, నోటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వాసంశెట్టి రాజేశ్వరి, కమిటీ ఛైర్మన్ వాసంశెట్టి వీరాంజనేయులు, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ నాని వీర్రాజు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

వెదురుపాక సొసైటీ మహాజన సభ

రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెదురుపాకలో సహకార పరపతి సంఘం మహాజనసభ సోమవారం నిర్వహించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ బీఎస్‌ఎస్‌వీవీఆర్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ భవన నిర్మాణానికి నిధుల సేకరణ, రాయవరంలోని గోదాము అద్దె వసూళ్లు తదితర అంశాలపై చర్చించారు. సంఘం లాభాల బాటన పయనించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయం చారు. నదురుబాద ఎంపీటీసీ సభ్యుడు వుండవిల్లి సుబ్బారాయుడు, కూటమి నాయకులు వుండవిల్లి రాంబాబు, కొవ్వూరి చంటిరెడ్డి, వద్దాది చిన్నశ్యాం రాజు, కొండేపూడి చంటి, పిల్లి గణేష్, సంఘ కార్యదర్శి వి.అన్నవరం, వెదురుపాక, వి.సావరం, రాయవరం, నదురుబాద గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని లడ్డూ కల్తీపై నిరసన

రామచంద్రపురం: తిరుపతి లడ్డూ కల్తీపై శ్రీవేంకటేశ్వర దుర్గాదేవి కోలసంబరం కళాకారులు సోమవారం పట్టణ ప్రధాన రోడ్డులో రాజగోపాల్ సెంటర్ నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాటలు పాడుతూ మేళ తాళాలతో సనాతన ధర్మాన్ని కాపాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మద్దతు తెలిపారు. దోషులు



ర్యాలీలో జనసేన నాయకులు, కోలసంబరం కళాకారులు

ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని, హిందువుల మనోభావాలను కాపాడాలని కోరుతూ ఆర్టీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెల్లకు చెందిన కోల సంబరం కళాకారులతోపాటు జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, గౌరవాధ్యక్షుడు కోట శ్రీను, అధ్యక్షుడు ఈత దుర్గారావు, ఉపాధ్యక్షుడు వాసంశెట్టి లక్ష్మణరావు, సభ్యులు చిక్కాల జూనియర్ బాలయ్య, చిక్కాల సూర్యనారాయణ, వెల్ల ఎంపీటీసీ సభ్యుడు చిక్కాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పాదయాత్ర

రాయవరం: తిరుమల లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఎన్డీఏ కూటమి నాయకులు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. సోమేశ్వరం వంతెన కూడలి నుంచి రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు జనసేన, తెదేపా, భాజపా నాయకులు పాదయాత్ర చేశారు. వుండవిల్లి రాంబాబు, నాగేంద్ర, దేవిశెట్టి చిన్ని, శశా శ్రీనివాస్, లొల్ల సర్పంచి చాట్రాతి జానకీ రాంబాబు, నరాల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం: తల్లిపాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మాచవరం సెక్టార్ ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎ.పద్మ అన్నారు. మాచవరంలో తెదేపా నాయకుడు సొజ్యంలో సోమవారం గర్భిణులకు నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ పౌష్టికాహార పదార్థాలను పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు గుణ్ణం పనసయ్య, ముత్యాల చంద్రశేఖర జానకీ రామన్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య, ఆరోగ్య శాఖ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

ద్వారపూడి: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండపేట మండలం ఇప్పనపాడు పంచాయతీ కార్యాలయంలో సర్పంచి కురుపు చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఉప సర్పంచి పద్దీ అర్జునరావు, తెదేపా గ్రామశాఖ అధ్యక్షుడు ఈది మంగసతిరాజు, కార్యదర్శి వి.అమరనాథ్‌గౌడ్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెదపాటి విష్ణుకు డాక్టరేట్ ప్రదానం

ద్వారపూడి: మండపేట మండలం కేశవరానికి చెందిన ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సేవా సమితి వ్యవస్థాపకుడు పెదపాటి విష్ణుకు గౌరవ డాక్టరేట్, మహాత్మాగాంధీ అంతర్జాతీయ శాంతి పురస్కారం అందుకున్నారు. ఆసియా వేదిక్ అంతర్జాతీయ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ స్పూర్తి అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో పురస్కారం అందుకున్నట్లు ఆయన తెలిపారు.

పాఠశాల శుభ్రత.. సభ్యులదే బాధ్యత

ప్రభుత్వ బడుల్లో మెరుగుపడనున్న పారిశుద్ధ్యం

న్యూస్‌టుడే, అంగర, పామర్రు

పాఠశాలల రూపురేఖలు మార్చడానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. వాటిని బలోపేతం చేసేందుకు పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)లను భాగస్వాములను చేస్తూ నిర్ణయం తీసుకుంది. తద్వారా ఉపాధ్యాయులను కేవలం బోధనాంశాలకే పరిమితమయ్యేలా చూస్తోంది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించింది. వీటికి ఎన్నికైన సభ్యులు పాఠశాలల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించనున్నారు. బడుల పరిశుభ్రత బాధ్యత



అంగర ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్డి ఇలా..

లను ప్రభుత్వం వీరికే అప్పగించింది. కమిటీ సభ్యులు, సచివాలయ సంక్షేమ సహాయకులు మరుగుదొడ్ల చిత్రాలు తీయాలని నిర్ణయించింది. వీటిని ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా తర్ఫీదు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. ఇందుకు ప్రత్యేక సంఖ్య పాస్‌వర్డ్‌లను కేటాయించింది. బుధ, శుక్రవారాల్లో ఎస్‌ఎంసీ సభ్యుల్లో ఒకరు, సోమ, గురువారాల్లో సచివాలయ సంక్షేమ సహాయకులు చిత్రాలు తీసి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వైకాపా ప్రభుత్వం ఉపాధ్యాయులపై పలు



అంగరలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల

యాప్‌ల నిర్వహణ పేరిట భారం మోపింది. వీటిలో వివరాల నమోదుకే వారు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చేది. ఫలితంగా విద్యార్థులకు సరైన బోధన అందేది కాదు. ఈ పనులు చేయని వారికి ఉన్నతాధికారులు తాకీదులిచ్చిన ఘటనలు కోకొల్లలు. ఎన్డీయే ప్రభుత్వ తాజా నిర్ణయంతో వారిపై భారం తగ్గనుంది.

గతంలో ఉత్సవ విగ్రహాల్లా..

గత వైకాపా ప్రభుత్వం పాఠశాలల యాజమాన్య కమిటీలను రద్దు చేసి, తల్లిదండ్రుల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులోని సభ్యులను కేవలం ఉత్సవ విగ్రహాలను చేసింది. నెలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు రావడం, సంతకాలు చేయడం, వెళ్లడానికే పరిమితమయ్యారు. తాజాగా ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలను పునరుద్ధరించి, సభ్యులకు కీలక బాధ్యతలు అప్పగించింది. పారిశుద్ధ్యం విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చూడాలని దిశానిర్దేశం చేసింది.

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
కె.గంగవరం	76	4287
రామచంద్రపురం	84	6594
కపిలేశ్వరపురం	51	3335
మండపేట	67	6517
రాయవరం	46	3363

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ..

ప్రభుత్వ ఆదేశానుసారం వారంలో రెండు రోజులు ఎస్‌ఎంసీ సభ్యులు, మరో రెండు రోజులు సంక్షేమ సహాయకులు మరుగుదొడ్ల చిత్రాలు తీసి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎక్కడైనా అపరిశుభ్రత కనిపిస్తే ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలి. పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

- శ్రీపాద శ్రీలక్ష్మీ నరసింహ ఫణి, డీవైఈవో, రామచంద్రపురం

గృహ నిర్మాణ లబ్ధిదారులకు త్వరలో రుణాలు

ద్వారపూడి, న్యూస్‌టుడే: గృహ నిర్మాణ లబ్ధిదారులకు త్వరలో రుణాలు మంజూరు చేయనున్నట్లు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన సోమవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి చివరి బిల్లులు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం తాగునీటి సమస్యలు, మురుగు కాలువలు పూడికతీతపై చర్చించారు. మురుగు కాలువలలో పూడిక తొలగించే కార్మికులకు తేదీ తొడుగులు, బూట్లు ఎప్పుడు ఇస్తారని వైకాపా సభ్యుడు మారిశెట్టి సత్యనారాయణ ప్రశ్నించగా బూట్లు ఇచ్చినట్లు కమిషనర్ రంగారావు తెలిపారు. తమతమ వార్డుల్లో జరిగే అభివృద్ధి పనులను కౌన్సిలర్లు పర్యవేక్షించాలని ఛైర్‌పర్సన్ సూచించారు. డ్రెయినేజీల్లో తొలగించిన పూడికను వెంటనే అక్కడ నుంచి తరలించాలని కౌన్సిలర్ సత్తి రాజేశ్వరి కోరారు.

విగ్రహాన్ని తొలగిస్తే ఊరుకునేది లేదు..

గతంలో కలువపువ్వు సెంటర్‌కు వేగుళ్ల వీర్రాజు సెంటర్‌గా పేరు మారుస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేశారని



ఛైర్‌పర్సన్ నూకదుర్గారాణి

అయితే వాడుకలో కలువపువ్వు సెంటర్‌గానే పిలుస్తున్నారని, అక్కడ కలువపువ్వు బొమ్మ ఏర్పాటు చేయాలని వైకాపా సభ్యుడు పిల్లి శ్రీనివాస్ కోరగా.. పట్టణానికి విశేష సేవలు అందించిన దివంగత వేగుళ్ల వీర్రాజు విగ్రహం జోలికి వస్తే ఊరుకునేది లేదని తెదేపా సభ్యుడు కాశిన కాశీ తీవ్రంగా వ్యతిరేకించారు. అక్కడ ఉన్న వేగుళ్ల వీర్రాజు విగ్రహం కదపడం జరగదని, దాని చుట్టూ కలువపువ్వు నిర్మించాలని తనకూ కోరిక ఉందని ఛైర్‌పర్సన్ అన్నారు.

ఆక్రమణలు తొలగించాలి..

పెద్ద కాలువ నుంచి సెంటర్ వరకు విగ్రహాల దగ్గర రకరకాల ఫ్లెక్సీలు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్నారని వాటి వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని కౌన్సిలర్ సబ్బెళ్ల రెడ్డి రాజబాబు కోరారు. ప్రతి వీధిలోను దుకాణాల ఎదుట ఆక్రమణలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

పెరిగిపోయాయని, వాటిని తొలగించాలని తెదేపా సభ్యుడు మందు సుబ్బారావు కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా తొలగిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

రూ. 4 కోట్లు అద్దె బకాయిలు..

పురపాలక దుకాణ అద్దె బకాయిల గురించి కమిషనర్‌ను ఎమ్మెల్యే వివరణ కోరగా సుమారు రూ.4 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అంత పెద్ద మొత్తంలో బకాయిలు ఉంటే రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. గతంలో కొంతమంది లీజుదారులు ఎక్కువ అద్దెకు దుకాణాలు పాడుకుని అద్దెలు చెల్లించకుండా వదిలేశారని, వారిపై కోర్టులో కేసులు వేయగా పురపాలక సంఘానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని ఆర్వో శర్మ వివరణ ఇచ్చారు. సమావేశంలో వైస్ ఛైర్మన్‌లు వేగుళ్ల నారయ్యబాబు, పిల్లి గణేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

లీజు దుకాణదారులు బకాయిలు చెల్లించాలి

మండపేట: మండపేట పురపాలక సంఘ పరిధిలోని తొమ్మిది దుకాణ సముదాయాల పరిధిలోని ఆరు దుకాణాలకు సంబంధించి 2015వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు లీజుదారుల బకాయిపడిన అద్దె వెంటనే చెల్లించాలని కమిషనర్ టి.వి.రంగారావు కోరారు. రూ.8,75,52,133 అద్దె, జీఎస్టీతో బకాయిలు చెల్లించాలన్నారు.

వృద్ధులకు వితరణ

మండపేట గ్రామీణం: మండపేట మున్సిపల్ మాజీ ఛైర్మన్ మండ్రు శ్రీవరప్రసాద్ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బాబు అండ్ బాబు కన్వర్షన్ హాల్లో పట్టణానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పలు సంఘాలు పలు శాఖల ఉద్యోగులు, అధిక సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలిపారు. మయూరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంచారు.

సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు

అంగర: విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు తగిన గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. కపిలేశ్వరపురం మండలం టేకి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న కడలి వెంకటరమణ ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం ఆయనను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జడ్పీటీసీ సభ్యుడు పుల్లపుడి అబ్బు, సర్పంచి కుక్కల నాగమణి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రికార్డు అసిస్టెంట్‌కు సత్కారం

పామర్రు: కె.గంగవరం ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా సుదీర్ఘకాలం పని చేసిన వడ్డి రాజశేఖర్ కరప ఉన్నతపాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

చెత్తకుప్పల తొలగింపు

ద్రాక్షారామ: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా నెలపర్తిపాడులో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలను జేసీబీ సహాయంతో తొలగించి ట్రాక్టరుపై డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణాచార్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. హసనబాదలో ర్యాలీ నిర్వహించి, దోమల వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచి నాగిరెడ్డి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



నడిచి వెళ్లాలన్నా.. నరకమే

మండపేట మండలం ద్వారపూడి జడ్పీ బాలికోన్నత పాఠశాల రహదారి అధ్వానంగా మారడంతో విద్యార్థులు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రహదారి ఛిద్రమైంది. వేములపల్లి, బంగారమ్మ కాలనీ, వస్త్ర దుకాణాల వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షం పడితే బురదతో నిండిపోయి నడవటానికి వీల్లేని పరిస్థితి ఉంటోంది. పలుపురు వాహన చోదకులు అదుపు తప్పి కిందపడి గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కనీస మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఆర్.అ.బ శాఖ డీఈ ఎస్.వి.సూర్యనారాయణను వివరణ కోరగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరయిన వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, ద్వారపూడి

ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉన్నత స్థానాలే లక్ష్యం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ఉన్నత స్థానాలకు ఎదగాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఇందులో భాగంగానే నియోజకవర్గ యువతకు 45 రోజులపాటు టెట్, డీఎస్సీ ఉచిత శిక్షణ ఇప్పించామన్నారు. స్థానిక వీఎస్ఎం కళాశాలలో జరుగుతున్న టెట్, డీఎస్సీ ఉచిత శిక్షణ ముగింపు సభ సోమవారం జరిగింది. మంత్రి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం అనంతరం 16,437 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు డీఎస్సీ పైలుపై తొలి సంతకం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. శిక్షణకు సాయం అందించిన సైను మిల్లర్స్ అసోసియేషన్, కె.వి.ఆర్ ఆసుపత్రి డాక్టర్ సతీష్ కుమార్, వీఎస్ఎం కళాశాల యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బాలాజీ, డాక్టర్ సతీష్‌కుమారను మంత్రి సత్కరించారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురంలో అన్నదానం

రామచంద్రపురం: గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా పట్టణ లారీ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి, కార్యదర్శి తోరం శ్రీనివాసరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎవరికీ పట్టని నుదురుబాద రోడ్డు

రామచంద్రపురం పట్టణం ఒకటో వార్డు కొత్తూరు నుంచి రాయవరం మండలం నదురుబాదకు వెళ్లే 2 కిలోమీటర్ల రోడ్డుపై నడక కూడా నరకంగా మారిందని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలను కలిపే ఈ రోడ్డును రెండు ప్రాంతాలవారు పట్టించుకోవట్లేదు. రోడ్డు రాయవరం మండలానికి చెందినదని..



అక్కడున్న పొలాలు కొత్తూరు రైతులవని.. ఎవరికి వారు రోడ్డు అభివృద్ధిని విస్మరించారు. ఎంతో ప్రాధాన్యమున్న నదురుబాద రోడ్డు నిర్మాణం విషయంలో మంత్రి సుభాష్ జోక్యం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రామచంద్రపురం

సోమేశ్వరస్వామికి లక్షపత్రిపూజ

రాయవరం: మండలంలోని వెంటూరు శ్రీపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి లక్షపత్రిపూజ ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రి నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామశర్మ, శుభాంగి దంపతులు పీటలపై కూర్చొని పూజాదికాలు చేశారు. వేద పండితులు తటవర్తి రామవరణం, దువ్వూరి రామారావు, వెంకట్రావు సుబ్రహ్మణ్యం తదితరుల నిర్వహణలో స్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, పార్వతీదేవికి సామూహిక కుంకుమార్చన, అర్చన, ధూపదీప నైవేద్యాలు నిర్వహించారు. శ్రీపార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఉత్సవమూర్తులతో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల మంజూరుకు వినతి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: శిరోముండనం బాధిత కుటుంబాల పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని దళిత ఐక్య పోరాట వేదిక ఆధ్వర్యంలో తహసీల్దారు వెంకటేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న పోరాట వేదిక సభ్యులు

తౌలుత కార్యాలయం ఎదుట ధర్నాకు దిగి నినాదాలు చేశారు. 2018వ సంవత్సరం నుంచి బాధిత కుటుంబాల పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఉన్నతాధికారులకు విన్నవించినా, ఇంతవరకు కేటాయించలేదన్నారు. ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పత్రాల మంజూరు విషయంలో జాప్యం చేస్తున్నారని పోరాట వేదిక కన్వీనర్ వెంటపల్లి భీమశంకరం, కో కన్వీనర్ బీర్ల వెంకటేశ్వరరావు వాపోయారు. ఇప్పటికైనా వారు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట వేదిక నాయకులు గుబ్బల శ్రీనివాసరావు, మట్టపర్తి రామకృష్ణ, మేడిశెట్టి ఇజ్రాయేల్, చల్లపూడి పెదపెద్ద ఆనంద్, తాతపూడి రాజు, చింత రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా మార్కెట్లతో మహిళల ఆర్థిక పురోగతి

ద్వారపూడి: పురపాలక సంఘం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన మెప్మా మార్కెట్‌ను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి సోమవారం ప్రారంభించారు. అందులోని వస్తువులను పరిశీలించారు. ఇటువంటి మార్కెట్లు మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ పిల్లి గణేశ్వరరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాజబాబు, కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్, గుండు రామతులసి, స్వరాజ్యలక్ష్మి, పురపాలక కమిషనర్ టి.వి.రంగారావు, సిటీ మిషన్ మేనేజర్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల వద్దే వస్తువులు కొనుగోలు చేయాలి..

రామచంద్రపురం: చిరు వ్యాపారుల వద్ద నుంచి వస్తువులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదం శెట్టి శ్రీదేవి అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం రూ.3వేల సామగ్రి కొనుగోలు చేశారు. టీఎంసీ గంగాదేవి, పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన కేంద్రం ప్రారంభోత్సవం రేపు

అంగర: కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రికలో నూతనంగా నిర్మించిన బ్రహ్మర్షి పత్రీజీ పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని అక్టోబర్ 2న ప్రారంభిస్తున్నట్లు పిరమిడ్ కమిటీ అధ్యక్షుడు చిక్కం రాంబాబు తెలిపారు. గ్రామానికి చెందిన కొలపట్ల కృష్ణకాంతరావు దంపతులు ధ్యాన కేంద్ర నిర్మాణానికి 5 సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందజేశారని తెలిపారు. ప్రజలు, దాతల సహకారంతో సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టామన్నారు. బుధవారం ఉదయం ఆనందోత్సవాలతో వారి ఆలయం వద్ద నుంచి మహోత్సవం ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం హిమాలయ యోగి శ్రీసంత్ సదానంద గిరి మహారాజ్ చేతుల మీదుగా ధ్యాన కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఉండ్రాజవరం బౌద్ధ గురువు పుట్టలాజనేయులు చేతులమీదుగా బుద్ధ విగ్రహం ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ధ్యాన మిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ద్రాక్షారామ: ద్రాక్షారామ, దంగేరు, పామర్రు సత్యసాయి సేవాసమితుల ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు జోనల్ బాలవికాస్ ఇన్‌ఛార్జి విస్సాప్రగడ కృష్ణమూర్తి తెలిపారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'భగవంతుడే నా నిజమైన స్నేహితుడు', జూనియర్ కళాశాల విద్యార్థులకు 'ఇచ్ఛుట-క్షమించుట', డిగ్రీ విద్యార్థులకు 'నాకు ప్రాణప్రదమైన విషయములు' అనే అంశాలపై పోటీలు నిర్వహించగా 522 మంది పాల్గొన్నారన్నారు. సమితి, పాఠశాల, జిల్లాస్థాయిల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో బంగారం, రజత, కాంస్య పతకాలు అందజేస్తారని తెలిపారు.

బాలికను వేధిస్తున్న యువకుడి అరెస్టు

రామచంద్రపురం: ప్రేమ పేరిట బాలికను వేధిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్లు సీఐ కడియాల అశోక్ కుమార్ తెలిపారు. ఆయన ప్రకారం రామచంద్రపురం గుబ్బలవారి వీధికి చెందిన గుత్తుల బాల వెంకట కృష్ణ అనే యువకుడు ప్రేమ పేరిట 17 ఏళ్ల బాలిక వెంటపడి వేధిస్తుండటమే కాకుండా ఆగస్టు 16వ తేదీ మద్యాహ్నం ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా మద్యం తాగి వచ్చి పెళ్లి చేసుకుంటానంటూ అసభ్యంగా ప్రవర్తించాడు. ఇది పసిగట్టిన సంబంధించిన విషయం కావడంతో బాలిక తల్లిదండ్రులు గోప్యంగా ఉంచారు. దీనిని అలుసుగా తీసుకొని నిందితుడు మరింత వేధిస్తుండటంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, అదే రోజు సాయంత్రం అరెస్టు చేసి సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

శిరస్త్రాణం తప్పనిసరి

అంగర: ద్విచక్ర వాహనచోదకులు విధిగా శిరస్త్రాణం ధరించాలని అంగర ఎస్సై రవికుమార్ సూచించారు. కపిలేశ్వరపురం ఏటిగట్టు వద్ద సోమవారం సాయంత్రం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్, తదితర పత్రాలు పరిశీలించి, సరైన పత్రాలు లేని పలువురికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. వారి చేతికి వాహనాలు ఇచ్చిన యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు

ద్రాక్షారామ: ద్రాక్షారామ పరిసర ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆది, సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ వీరు పట్టుబడ్డారు.

నియంత్రణ కరవు.. బిల్లుల బరువు

పగటి వేళలోనూ వెలుగుతున్న వీధి దీపాలు

న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం, అంగర, రాయవరం

మండపేట నియోజకవర్గ వ్యాప్తంగా కొన్ని గ్రామ పంచాయతీల్లో రాత్రి పగలు తేడాలేకుండా వీధి దీపాలు వెలుగుతూనే ఉంటున్నాయి. దీనివల్ల బిల్లుల భారం తడిసిమోపెడవుతోంది. వీధి దీపాలు పగలు వెలగకుండా చర్యలు తీసుకుంటే కనీసం కొంతైనా బిల్లుల భారం తగ్గే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలకు ఉపక్రమించాలని ప్రజలు కోరుతున్నారు.

మండపేట నియోజకవర్గంలోని మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో 43 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో సుమారు 15 పెద్ద పంచాయతీలు. వీటిలో వీధి దీపాలకు సంబంధించి బిల్లు కనీసం రూ.లక్షకు తగ్గడం లేదు. చిన్న పంచాయతీల్లో రూ. 50 వేలకు తక్కువ కాకుండా వస్తున్నాయి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇదివరకు కెండడ ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. పగలు ఆర్పేసి, రాత్రి వెలిగే విధంగా సీసీఎంఎస్ బాక్సులను ఏర్పాటు చేశారు. పంచాయతీ దినోత్సవం సందర్భంగా మండపేట మండలంలోని ద్వారపూడిలో ఈ దీపాల వ్యవస్థను ప్రారంభించారు. కొంత కాలం బాగానే నడిచింది. అనంతరం సరిగా పట్టించుకోకపోవడం, గుత్తేదారులు ఎల్‌ఈడీలను సరిగా పర్యవేక్షణ చేయక పోవడం వంటివి జరిగినట్లు అప్పటి, ఇప్పటి పంచాయతీలు గగ్గోలు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. పంచాయతీ విద్యుత్తు కార్మికులు చేత ఎల్‌ఈడీ నిర్వహణ వంటివి జరుగుతున్నాయి. సీసీఎంఎస్ బాక్సులు దెబ్బతిన్న చోట స్విచ్ బాక్సులను ఏర్పాటు చేసి, పగలు నిలిపేసి, రాత్రి ఆన్ చేస్తున్నారు. కొన్ని చోట్ల మూడో లైన్ ఏర్పాటు లేకపోవటంతో నేరుగా వీధి దీపాలు వెలుగుతూనే ఉంటున్నాయి. మండపేట మండలం కేశవరం, ద్వారపూడి, ఏడిద, అంగర, కపిలేశ్వరపురం, అద్దంకివారిలంక, రాయవరం, లొల్ల, పంచాయతీల్లో సుమారు రూ. 80 వేలు పైగా విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. తాగునీటి మోటర్లు బిల్లులు కాకుండా వీధి దీపాల బిల్లులే సుమారు నియోజకవర్గంలో రూ. కోటిన్నర పైగా ఉంటోంది. కొన్ని కోట్ల బకాయిలు ఉన్నాయి.



ఏడిదలో పట్టపగలే వెలుగుతున్న దీపం

ప్రత్యేక లైను ఏర్పాటు చేస్తాం..

నియోజక వర్గం పరిధిలో అన్ని గ్రామాల్లో వీధి దీపాలు పగటి వేళల్లో వెలగకుండా ఉండేందుకు స్విచ్ బోర్డులను గతంలో ఏర్పాటు చేశారు. అవి దెబ్బతినడంతో ప్రతి వీధి దీపానికి ఒక స్విచ్ ఏర్పాటు చేశారు. వర్షాలకు అవి దెబ్బతినడంతో నిత్యం వెలుగుతున్న పరిస్థితి. విద్యుత్తు శాఖను సమన్వయం పరుచుకుని అవసరాన్ని బట్టి ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి గ్రామానికి కొన్ని ప్రాంతాల్లో నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. పగటి వేళలో వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం.

- ఉయ్యాల రాజు, డీఎల్‌పీవో, రామచంద్రపురం